

సమన్వయ లోపం

- ప్రభుత్వ ఆస్తుల రక్షణలో వివిధశాఖల వైఫల్యం
- అక్రమ లేఅవుట్లపై పొంతన లేని సమాధానాలు
- ఆక్రమిత స్థలాల్లో పూర్తికాని సర్వే
- వాస్తవాలు నిగ్గుతేలేదెప్పుడో...?

కావలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కబ్జాదారులు ఆక్రమించిన ప్రభుత్వ స్థలాల విషయంలో నెలకొన్న గందరగోళం ఇంకా ఓ కొలిక్కి రాలేదు. అక్రమలేఅవుట్లలో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిరక్షించటంలో రెవెన్యూ, మున్సిపల్, జలవనరుల శాఖల మధ్య సమన్వయం కొరవడింది. ఎవరికి వారు తప్పించుకుంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప, వాటికి రక్షణ కల్పిద్దామనే ఆలోచనలేదు. అక్రమ లేఅవుట్లలోని ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకునేందుకు ఏడాది కిందట సర్వే చేపట్టారు. అది ఇంకా పూర్తి కాలేదు. ఈ అక్రమ లేఅవుట్లలో ఎంత ప్రభుత్వ స్థలం ఉందనే విషయమై ఆయా శాఖల అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు.

● 123 లేక 145 ఎకరాలా...?

కావలిలో అక్రమ లేఅవుట్‌దారులు 123 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని, సుమారు 9 నెలల కిందట మున్సిపల్ కార్యాలయంలో తహసీల్దార్ వెల్లడించారని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ విలేకరులకు వివరించారు. అయితే ఇటీవల సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య సమాచార హక్కు చట్టం కింద కావలి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ లేఅవుట్లు ఎన్ని ఉన్నాయి.. ఎన్నిఎకరాల్లో లేఅవుట్లు వేసి ఉన్నారని అడిగారు. ఇందుకు సమాచార హక్కు చట్టం కింద పట్టణప్రణాళికాధికారి సమాధానమిస్తూ 145 ఎకరాల్లో 18 అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. దీన్ని బట్టి అధికారుల వద్ద స్పష్టమైన సమాచారం లేదని తెలుస్తోంది.

● ఆస్తులు ఎక్కడున్నాయో ఆశాఖకే తెలియదు..

అక్రమ లేఅవుట్‌దారులు ఆక్రమించిన స్థలాలు ఎక్కువగా కాలువలు, నీటికుంటలు, చెరువు లోతట్టు ప్రాంతాలు ఉన్నాయి. ఇవన్నీ జలవనరులశాఖ పరిధిలోకి వస్తాయి. అయితే జలవనరులశాఖ అధికారులకు మాత్రం తమశాఖ ఆస్తులు ఎక్కడ ఉన్నాయో కూడా పూర్తిగా తెలియదు. రెవెన్యూ శాఖ సర్వేచేసి తమకు అప్పగిస్తే వాటిని కాపాడుకుంటామని వారు చెబుతున్నారు. అంతేకాక అన్నీ ప్రభుత్వ ఆస్తులపై రెవెన్యూకే హక్కులు ఉంటాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత కూడా వారిదేనని అంటున్నారు.

● మామూళ్లు ఇస్తే చాలు

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి లేఅవుట్లు వేస్తుంటే, వాటిని అడ్డుకోవాల్సిన మున్సిపల్ అధికారులు తమ మామూళ్లు తమకు వస్తే చాలన్నట్లుగా ఉంటున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఆక్రమణల స్థలాలు జలవనరులశాఖవి, వాటిని గుర్తించాల్సింది రెవెన్యూ శాఖవారు మధ్యలో మనకెందుకులే అన్నట్లుగా వారు వ్యవహరిస్తున్నారు. అందినంత ముడుపులు తీసుకుని మిన్నకుండిపోతున్నారు.

● స్వాధీనానికి వెనుకడుగు

అక్రమలే అవుట్లను సర్వేచేసి, వాటిలో ఉన్న ప్రభుత్వ స్థలాలు గుర్తించినా వాటిని స్వాధీనం చేసుకునేందుకు అధికారులు వెనుకాడుతున్నారు. ఇకపోతే మున్సిపల్ అధికారులే కొంతఖర్చు పెట్టి ట్రంచ్ కొట్టిస్తున్నా కొంతకాలం తర్వాత వాటిని ఆక్రమణదారులు పూడ్చివేస్తున్నా పట్టించుకోవటంలేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఆక్రమణల స్థలం ఎంతో తేల్చుతాం



కావలిలోని అక్రమ లేఅవుట్లలో ప్రభుత్వ స్థలం గుర్తించేందుకు సర్వే చేస్తున్నాం. అది పూర్తి అయితేనే ఎంత స్థలం ఆక్రమణకు గురైందో స్పష్టంగా చెప్పగలం. ఈనెలాఖరుకు సర్వే పూర్తి అవుతుంది.

- ఎం. సన్నీ వంశీక్రిష్ణ, ఆర్డీవో

తేల్చాల్సింది రెవెన్యూశాఖే...!



అక్రమ లేఅవుట్లలో ప్రభుత్వ స్థలాలు ఎంత ఉన్నాయో తేల్చాల్సిందే రెవెన్యూశాఖే. గతంలో ఆర్డీవో ఇచ్చిన సమాచారం మేరకు తహసీల్దార్ సమక్షంలో తాను అక్రమ లేఅవుట్లలో 123 ఎకరాలు ప్రభుత్వ స్థలం ఉందని చెప్పాం. లేఅవుట్లు గుర్తించగలంకానీ, అందులో ప్రభుత్వ స్థలం ఉందని తమకు ఎలా తెలుస్తుంది. సర్వే పూర్తి అయితే కానీ స్పష్టత రాదు.

- జీ.శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్



రైతులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఆనంద్, పక్కన కావలి ఎమ్మెల్యే డీవీ క్రిష్ణారెడ్డి

విమానాశ్రయ భూసేకరణపై సమీక్ష

- కావలి ఎమ్మెల్యే, ఆర్డీవో సమక్షంలో రైతులతో మాట్లాడిన కలెక్టర్
- కుదిరిన ఏకాభిప్రాయం
- త్వరలోనే పనుల ప్రారంభం

కావలి, జూన్28(ఆంధ్రజ్యోతి) దగదర్తి మండలం దామవరం విమానాశ్రయ భూసేకరణను అధికారులు వేగవంతం చేశారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డితో కలిసి కలెక్టర్ ఓ ఆనంద్ రైతులతో సమీక్ష నిర్వహించారు. విమానాశ్రయానికి ఇంకా 700 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, అందులో సుమారు 400 ఎకరాల వరకు హక్కుల విషయంలో రైతుల వివాదం కోర్టులో ఉంది. భూసేకరణలో ప్రధాన సమస్యగా ఉన్న కేసుల విషయమై రైతులతో ఎమ్మెల్యే సమక్షంలో కలెక్టర్ మాట్లాడారు. అయితే పరిహారం విషయంలో వివాదంలో ఉన్న రైతులు ఏకాభిప్రాయానికి వచ్చినా, అది కోర్టులో ఉన్నందున దాన్ని ఎలా పరిష్కరించాలనే దానిపై సమీక్షించారు. ఒకవేళ మీరు కోర్టులో రాజీ పడకుండా జాప్యం చేస్తే, పరిహారం సొమ్మును కోర్టులో చెల్లించి తాము భూములను స్వాధీనం చేసుకుంటామని కలెక్టర్ చెప్పారు. దీంతో వారు కోర్టులో రాజీ పడేందుకు సుముఖత వ్యక్తం చేశారు. త్వరలో భూసేకరణ పూర్తి చేసి విమానాశ్రయ పనులు ప్రారంభిస్తామని సమీక్ష అనంతరం ఎమ్మెల్యే విలేకరులకు తెలిపారు. ఈ సమీక్షలో ఆర్డీవో ఎం.సన్నీ వంశీక్రిష్ణ, దగర్తిమండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

- వేలం కేంద్రం వద్ద రైతుల అర్ధనగ్న ప్రదర్శన
- మద్దతు తెలిపిన సీపీఎం రైతు సంఘం

కందుకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): లోగ్రేడ్ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని కందుకూరులోని పొగాకు వేలం కేంద్రం-2 వద్ద కొండసముద్రం, మాలకొండరాయునిపాలెం పొగాకు రైతులు శనివారం అర్ధనగ్న ప్రదర్శనతో రాస్తారోకో నిర్వహించారు. క్లస్టర్‌లో 180 బేళ్లు పెడితే 100 బేళ్లు నోబిడ్ చేయడంతో కొనుగోళ్లలో అతి తక్కువ ధర పలికాయి. ఇందుకు నిరసనగా వేలం కేంద్రాన్ని రైతులు మూసి వేసి నిరసనకు దిగారు. పొగాకు రైతు లకు మద్దతుగా సీపీఎం రైతు సంఘం నాయకులు జీ వెంకటేశ్వర్లు, గౌస్‌బాషా, కుమార్, రాయుడు నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు పొగాకు రైతులు, సీపీఎం నాయకులు మాట్లాడుతూ కొనుగోళ్ల ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు వ్యాపారులకు ఆదేశాలు ఇవ్వకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా కొనుగోళ్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఎకరా పొగాకు సాగుకు రూ.1,80,000 ఖర్చు కాగా, కనీసం 1,20,000 కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయని రైతులు విచారం వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర కల్పించేంత వరకు ఎన్ని రోజులైనా నిరసన కొనసాగిస్తామని రైతులు పేర్కొన్నారు.



అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న పొగాకు రైతులు

వక్ఫ్‌బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ అజీజ్, పాల్గొన్న సభ్యులు



రూ. 15 కోట్లతో
దర్గాల అభివృద్ధి

- వక్ఫ్ ఆస్తులు ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు
- వాణిజ్య దుకాణాల అద్దె పెంపుపై కమిటీ
- వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

నెల్లూరు(సిటీ), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దర్గాల అభివృద్ధికి రూ. 15 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. శనివారం నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో బోర్డు 4వ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్గాల అభివృద్ధిని జిల్లా నుంచే మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బారాషహీద్ దర్గా వద్ద రూ. 11 కోట్లతో షాహీమసీదు, ఈద్గాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే రూ. 2 కోట్లు ఖర్చు చేస్తుండగా, మరో 5 కోట్లను సీఎం చంద్రబాబు విడుదల చేశారన్నారు. దర్గా నుంచి వచ్చే నిధులు రూ. 1.50 కోట్లు, మైనార్టీ శాఖ నుంచి మరో రూ. 1.50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వివరించారు. కసుమూరు, ఏఎస్‌పేట దర్గాలలో అన్నీ సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. గుంటూరు జిల్లా మల్లాయపాళెం వద్ద వక్ఫ్‌బోర్డుకి 236 ఎకరాలు, చిన్నకాకాణి వద్ద 77 ఎకరాల భూమి ఉందని, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు తమకు ఆ భూములు ఇవ్వాలని ఏపీఐఐసీ లేఖ రాసిందని అజీజ్ తెలిపారు. ఇప్పట్లో ఆ భూములను ఏపీఐఐసీకి అమ్మబోమని స్పష్టం చేశారు. కానీ దీర్ఘకాలం లీజు పద్ధతిలో బోర్డు పేరిటే కేటాయింపులు జరుపుతామన్నారు. వక్ఫ్‌బోర్డులో ఉద్యోగులు, సిబ్బంది కొరత ఉందని, వీటి భర్తీ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. ఆస్తుల పరిరక్షణలో భాగంగా వివిధ కోర్టుల్లో 1500లకు పైగా కేసులు నడుస్తున్నాయన్నారు. జిల్లాల్లో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ఏర్పాటు చేసిన కమిటీల్లో చైర్మన్‌గా కలెక్టర్లుగా, సభ్యులుగా ఎస్పీలను చేర్చామన్నారు. ఈ సమావేశంలో వక్ఫ్‌బోర్డు డైరెక్టర్లు ఎమ్మెల్సీ రుహుల్లా, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, ఖాజా, అక్రం, ముక్రం, తషీమా, దావూద్‌బాషా, జకీర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీకి భూములు విక్రయించం

● అద్దె పెంపుపై కమిటీ

రాష్ట్రంలో వక్ఫ్‌బోర్డు నేతృత్వంలో 1300 వాణిజ్య దుకాణాలున్నాయని, వాటిని అతి తక్కువ అద్దె వస్తున్నదన్నారు. వాస్తవ అద్దెను రాబట్టడానికి రివ్యూ కమిటీని నియమిస్తున్నామని, తద్వారా 30 నుంచి 40 శాతం అద్దె పెరిగే అవకాశం ఉందని అజీజ్ పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని స్థానిక పేద ముస్లింలకు ఖర్చు చేస్తామని చెప్పారు. వక్ఫ్‌బోర్డుకు చెందిన భూముల లీజు పరిధిని పెంచుతున్నామన్నారు. పూర్వీకుల ఆస్తులను ఎవరైతే దుర్వినియోగానికి పాల్పడి, అన్యాక్రాంతం చేశారో వారని గుర్తించి క్రిమినల్ కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు.



సీట్లు 1,560...
చేరింది 260 !

- హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ కోర్సులపై నీలినీడలు
- ప్రవేశాలపై విద్యార్థినుల అనాసక్తి
- అయోమయంలో ఉపాధ్యాయులు
- రెండురోజుల్లో ముగుస్తున్న అడ్మిషన్ల గడువు

నెల్లూరు(విద్య), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంపై గత వైసీపీ ప్రభుత్వం ప్రదర్శించిన నిర్లక్ష్యం... చిన్నచూపు ఎంతోమంది విద్యార్థినుల పాలిట శాపంగా మారింది. ఈ క్రమంలో ఇంటర్ నిర్వహించే హైస్కూల్ ప్లస్ పాఠశాలలు పరిస్థితి జిల్లాలో దారుణంగా తయారైంది. ఈ ఏడాది ప్రవేశాలు సరిగాలేక ఉపాధ్యాయులు అయోమయంలో పడ్డారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 1,560 సీట్లకుగాను 260 మంది మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

● స్పందన ఏదీ ?

హైస్కూల్ ప్లస్‌లో వరుస వైఫల్యాలతో చేదు అనుభవాల నుంచి తేరు కున్న విద్యాశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టినా, క్షేత్రస్థాయిలో స్పందన లభించలేదు. కళాశాలల్లో పాఠ్యపుస్తకాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు లేకుండానే తరగతుల నిర్వహణ, ప్రయోగశాలల్లో విద్యార్థులకు సైన్స్ పాఠాలపై ప్రాక్టికల్స్ లేకుండా పరీక్షలకు పంపడంతో గతంలో అతి తక్కువ ఉత్తీర్ణతతో అపఖ్యాతిని మూటగట్టుకున్నాయి. ఎలాంటి వసతులు, బోధన లేకుండా ఇంటర్ తరగతుల నిర్వహణపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తూ, కొంత మంది తమ పిల్లలను ఇతర కళాశాలల్లో చేర్పించారు. ఇవన్నీ ఈ ఏడాది అడ్మిషన్లపై తీవ్ర ప్రభావం చూపాయి.

● చేరింది 260 మంది మాత్రమే

13 హైస్కూల్ ప్లస్-2లో ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో గ్రూపునకు 40 సీట్ల చొప్పున మొత్తం 1560 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కానీ ఈ రోజు వరకు అన్ని కోర్సుల్లో కలిపి 260 మంది మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించి, బాలికల విద్యాభివృద్ధికి పాటుపడాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

అడ్మిషన్లపై అనాశక్తి

జిల్లాలోని సంగం, మనుబోలు, నెల్లూరు సంతపేట, వావిళ్ల, బ్రహ్మదేవం, నార్తురాజుపాళెం, కలువాయి, బిట్రగుంట, ఇందుకూరుపేట, నార్తుమోపూరు, జలదంకి, గాంధీజనసంఘం, ఇస్కపల్లిలో హైస్కూల్ ప్లస్ పాఠశాలలను హైస్కూల్ ప్లస్-2గా అప్‌గ్రేడ్ చేశారు. అయినా ఇంటర్ అడ్మిషన్లపై విద్యార్థినులు అనాశక్తిని చూపుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత ఏడాదితో పోల్చితే పరిస్థితి కాస్త మెరుగుపడినా బోధనా సిబ్బంది, పర్యవేక్షణ లోపం, ఫలితాల ప్రభావం తదితర కారణాలతో విద్యార్థినులు వీటిలో చేరేందుకు ఆసక్తి చూపడంలేదు. తల్లిదండ్రులకు సైతం భరోసా ఇవ్వలేకపోవడంతో కొద్దిమంది మాత్రమే ఈ ఏడాది అడ్మిషన్లు తీసుకున్నారు. కేవలం విద్యార్థినుల కోసమే వీటిని నిర్వహిస్తున్నా కూడా ప్రవేశాలు పొందేందుకు ముందుకు రావడం లేదు. మరో రెండు రోజుల్లో అడ్మిషన్లు పూర్తవుతుండగా స్వల్పంగా మాత్రమే అడ్మిషన్లు రావడంతో వీటి మనుగడ ప్రశ్నార్థకమైంది.

హైవే దిగ్బంధిస్తే క్రిమినల్ కేసులు తప్పవు

- కరేడు గ్రామస్థులకు పోలీసుల హెచ్చరిక

ఉలవపాడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాస్తారోకో, దిగ్బంధం వంటి చట్ట వ్యతిరేక పనులు చేపడితే క్రిమినల్ కేసులు తప్పవని కందుకూరు డీఎస్పీ సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం కరేడు గ్రామస్థులను హెచ్చరించారు. శనివారం కరేడు గ్రామంలో సీఐ వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్సై అంకమ్మ, సిబ్బందితో కలిసి ఇండోసోలార్ భూసేకరణ బాధితులతో మాట్లాడారు. దీనిలో భాగంగా ప్రధానంగా గ్రామంలో ఉద్యమాన్ని నడిపిస్తున్న మిరియం శ్రీనివాసులను పోలీసులు అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. ఇండోసోల్ సోలార్ కంపెనీ కోసం ప్రస్తుతానికి కరేడు రెవెన్యూ పరిధిలోని సుమారు 4000 ఎకరాల భూసేకరణ కోసం ప్రభుత్వం రైతువారి పట్టా నెంబర్లుతో జీవో విడుదల చేసింది. దీనిపై భగ్గుమంటున్న గ్రామస్థులు ఆదివారం జాతీయ రహదారి కరేడు ర్యాంపు వద్ద హైవే దిగ్బంధంకు పిలుపు ఇచ్చారు. కరేడు గ్రామస్థులు, రైతు లు చేపడుతున్న పోరుబాటకు మద్దతుగా పాల్గొనాలని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్‌ను, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలను కలిసి వినతిపత్రాలు అందించారు. దీంతో అప్రమత్త మైన పోలీసు శాఖ ముందస్తుగా గ్రామస్థులు, రైతు లతో మాట్లాడి హెచ్చరికలు జారీచేశారు.



కరేడు గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ, ఎస్సై

జూలై 5న గ్రామసభ

ఇండోసోల్ కంపెని భూసేకరణ నిమిత్తం జూలై 5న కరేడు సచివాలయం-1 వద్ద గ్రామసభ నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు శనివారం దండోరా వేయించారు. కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, డీఎస్పీ సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొంటారని గ్రామస్థులు, రైతులు గ్రామసభలో పాల్గొని సందేహాలను తీర్చుకోవాలని కోరారు.

డబ్బులిస్తేనే టీసీ, సర్టిఫికెట్లు

- ఇంటర్ బోర్డుకు విద్యార్థుల ఫిర్యాదు
- బోర్డు ఆదేశాలతో జిల్లా అధికారి విచారణ

కందుకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఒకేషనల్ విద్యాశాఖ అధికారి సుబ్బారావు శనివారం ఆకస్మికంగా విచారణ నిర్వహించారు. కళాశాలలో ప్రిన్సిపాల్ నాగూర్‌వలి టీసీల కోసం విద్యార్థుల వద్ద డబ్బులు వసూళ్లు చేస్తున్నాడని ఇంటర్ బోర్డుకు ఫిర్యాదులు అందాయి. బోర్డు సెక్రటరీ ఆదేశాల మేరకు ఆయన విచారణకు వచ్చారు. కళాశాల అధ్యాపకులు, లైబ్రేరియన్‌తోపాటు సిబ్బందిని విచారించారు. ప్రిన్సిపాల్‌తోనూ మాట్లాడారు. అయితే విద్యార్థులను విచారించాల్సి ఉందని, బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని సుబ్బారావు తెలిపారు.

నీకు చదువు రాదు..
టీసీ తీసుకుని వెళ్లిపో... !

- విద్యార్థిపై ఆగ్రహించిన సైన్సు టీచర్

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడే 'నీకు చదువురాదు.. టీసీ తీసుకుని వెళ్లిపో' అని ఓ విద్యార్థిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ సంఘటన దుత్తలూరు ఆదర్శ పాఠశాలలో శనివారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు కథనం మేరకు వివరాలు.. ఆదర్శ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న హర్షవర్ధన్‌రెడ్డిని శుక్రవారం సైన్స్ ఉపాధ్యాయుడు రాజశేఖర్ పిలిచి టీసీ తీసుకుని వెళ్లిమన్నాను కదా... మళ్లీ ఎందుకు వచ్చావు... అని అగ్రహం వ్యక్తం చేశాడు. అంతేకాక విద్యార్థి తల్లికి కూడా ఫోన్ చేసి పాఠశాలకు వచ్చి మీ అబ్బాయి టీసీ తీసుకెళ్లాలని చెప్పాడు. దీంతో శనివారం ఆ విద్యార్థి బంధువులు పాఠశాలకు వచ్చి ప్రిన్సిపాల్ సైమన్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఆయన విద్యార్థిని పిలిచి వివరాలు సేకరించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా ఆ ఉపాధ్యాయుడు ప్రస్తుతం స్కూలులో లేరని, రాగానే విచారించి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కాగా గత ఏడాది నుంచి హర్షవర్ధన్‌రెడ్డి సరిగా చదవడం లేదని, అందుకనే సైన్స్ టీచర్ చదువు మానేయమని చెప్పాడని కొందరు విద్యార్థులు పేర్కొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసర సరకుల పంపిణీ

కోవూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసర సరకుల ను శనివారం ఇంటింటికీ తిరిగి చౌకదుకాణాల డీలర్లు పంపిణీ చేశారు. నిత్యావసర సరకుల పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య పరిశీలించి డీలర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9200
వెండి కిలో ధర	రూ. 108900
వెండి ఒక గ్రాము	రూ. 111.90

న్యూస్ బాక్స్

10 అజెండాలకు ఏకగ్రీవ ఆమోదం



సమావేశంలో పాల్గొన్న చైర్ పర్సన్ మోర్ల సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):బుచ్చి నగర పంచాయతీ కార్యాలయం కౌన్సిల్‌హాల్‌లో కమిషనర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురళి అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశంలో మొత్తం 10 అజెండాలు ప్రవేశపెట్టగా వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదించినట్టు చైర్‌పర్సన్ తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో నగర పంచాయతీలో మొత్తం 20వార్డులలో ప్రతి వార్డుకు రూ.10లక్షల వంతున అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నగర పంచాయతీ అభివృద్ధిపై స్థానిక ప్రజల తరఫున ఎమ్మెల్యే, ఎంపీ వేమిరెడ్డి దంపతులకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. కాగా, హౌసింగ్ లేఔట్లలో పక్కాగా ప్లాట్లు, రోడ్లు ఏర్పాటు చేసిన హౌసింగ్ లేఔట్లలో ఏర్పాటుచేయాల్సిన ప్రాంతం వదిలి ఇళ్ళ మీద విద్యుత్‌లైన్లు ఏర్పాటుచేసిన విద్యుత్ అధికారుల తప్పిదానికి మున్సిపాలిటీ నిధులు ఎందుకు ఖర్చుపెట్టాలని 16వ వార్డు కౌన్సిలర్ ప్రమీలమ్మ ప్రశ్నించారు.

దశలవారీగా బుచ్చి పట్టణాన్ని అభివృద్ధి చేస్తాం

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో బుచ్చి పట్టణంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని, దశలవారీగా బుచ్చి పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. శనివారం బుచ్చి నగర పంచాయతీలోని 2వ వార్డులో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, మురళి, ఆ వార్డు కౌన్సిలర్ జూగుంట కల్యాణ్ నాయకులతో కలిసి పర్యటించి (పబ్లిక్ గ్రీవెన్స్) ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో తమ సమస్యలు పట్టించుకునే వారే కరువయ్యారని ఎమ్మెల్యే ముందు ఏకరువు పెట్టారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రతి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలలో ప్రతి హామీ అమలు చేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజాభిప్రాయాలు తెలుసుకున్నారు. తాగునీరు, డ్రైన్లు, రోడ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, డ్రైన్‌లలో చెత్తా చెదారాలు వేయకుండా సహకరించాలని ప్రజలకు సూచించారు. కూటమి ప్రభుత్వంలో రూ.3కోట్లతో రోడ్లు, డ్రైన్లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. కొత్తగా ఎన్నికైన తెలుగుదేశం పార్టీ బూత్ లెవల్, వార్డు కమిటీ కార్యవర్గాలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేయనున్నట్టు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్ళి కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, బుచ్చి అర్బన్, రూరల్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, బెజవాడ జగదీష్, పలువురు కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు ఎంవీ. శేషయ్య, రామానాయుడు, ఫిరోజ్, జూగుంట పురుషోత్తం, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



బుచ్చి 2వ వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, తదితరులు

ధర లేక మిరప రైతు దిగాలు



ఇందుకూరుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పెరిగిన పెట్టుబడులు అమాంతం పడిపోయిన ధరలు మిరప రైతును తీవ్రంగా కుంగదీస్తున్నాయి. రెండేళ్లుగా కనీసం మద్దతు ధర లేక ఇందుకూరుపేట మండలంలో 100 ఎకరాల్లో సాగు చేస్తున్న మిరప రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వచ్చే ఏడాదైనా ధర పెరగక పోతుందా అని పంటను శీతల గోదాములలో నిలువ చేసుకుని ఎదురుచూస్తున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరి దయనీయంగా తయారైంది. తెగుళ్ల రూపంలో కష్టాలు ధరల రూపంలో నష్టాలు వెంటాడుతూ ఉన్న కొందరు రైతులు ఈ ఏడాది కూడా మిరప పంటకు సిద్ధమవుతున్నారు. ఏటా రుణ భారం పెరగడంతో చాలా మంది రైతులు సాగు చేయడం మానేస్తున్నారు. 2021-22 సంవత్సరంలో చైనా లాంటి దేశాలకు ఎగుమతులు ఉండడంతో మిరప పంట ధర క్వింటాకు రూ.40వేలుకుపైగా పలికింది. దీంతో రైతులు మిరప సాగును పెంచారు. అంతర్జాతీయ మార్కెట్ పడిపోవడంతో గత ఏడాది ధరలు పతనమయ్యాయి. 2023లో రూ.35వేలు ధర ఏడాదిలోనే రూ.12వేలకు పడిపోయింది. దీంతో పంటను అమ్ముకోకుండా శీతల గోడౌన్లలో నిల్వ చేసుకుని ధర కోసం ఎదురుచూస్తున్నారు. విదేశాలకు ఎగుమతి ఉంటేనే మిరపకు మంచి ధర లభిస్తుందని రైతులు చెబుతున్నారు.

పెరిగిన పెట్టుబడి

ఐదేళ్ల కిందట వరకు ఎకరాకు మిరప సాగుకు సగటున రూ.1,50,000 పెట్టేవారు. కోవిడ్ తరువాత మిరపలో నల్ల తామర బెడద మొదలైంది. దీన్ని నివారించడానికి పెద్ద మొత్తంలో పురుగు మందులు వాడాల్సి రావడంతో పెట్టుబడుల అమాంతం పెరిగాయి. మార్కెట్‌లో 50మిలీ రూ.2వేలకు తక్కువ దొరకడంలేదు. పురుగు మందులకే ఎకరాకు రూ.35వేల ఖర్చు అవుతుంది. ప్రస్తుతం ఎకరాకు రూ.2లక్షల నుంచి రూ.2.5లక్షల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. మిరప ధరలు పెరగాలంటే విదేశాలకు ఎగుమతి ఉంటేనే మిరపకు మంచి ధర లభిస్తుందని మిరపకు పురుగు మందు అవశేషాలు మోతాదుకు మించి ఉన్నాయని కారణంతో పంట తిరస్కరణకు గురవుతున్నాయని దీంతో ఎగుమతులు నిలిచిపోయాయని రైతులు వాపోతున్నారు.

పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థినికి ఆర్థిక సాయం

తోటపల్లిగూడూరు, జూన్ 28(ఆంధ్రజ్యో తి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల విద్యార్థిని చేబ్రో లు విజ్ఞానజోషిక పదో తరగతి పరీక్షల్లో 585 మార్కులు సా ధించి మండల స్థా యిలో ప్రథమ స్థానం లో నిలిచింది. దీంతో మాచర్లవారిపాలెంకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త నాయుడు ఆదికేశవులరెడ్డి శనివారం ఆ బాలికను సన్మానించి అభినందించడంతో పాటు రూ.25వేలు ఆర్థికసాయం అందజేశారు. దీంతోపాటు పాఠశాల తరపున రూ.30 వేలు ఆ బాలి కకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థితికి ఎదగాలని, తోటపల్లి గూడూరు జిల్లా పరిషత్ పాఠశాలకు గుర్తింపు తేవాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు షేక్.రియాజ్‌అహ్మద్ మాట్లాడుతూ తమ పాఠశాలలో 350 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారికి ఐరన్ డెస్కులు కేటాయించాలని కోరడంతో అందుకు ఆదికేశవరెడ్డి సమ్మతించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానించి అభినందిస్తున్న పారిశ్రామికవేత్త ఆదికేశవరెడ్డి

రేపటి ధర్నాను విజయవంతం చేయండి

ముత్తుకూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై ఈనెల 30వ తేదీన నెల్లూరు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నక్క రాధయ్య పిలుపునిచ్చారు. శనివారం వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలో ప్రచార జాతా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కార్మికులు సోమవారం ఉదయం 10గంటలకు నెల్లూరు కలెక్టరేట్‌కు తరలివచ్చివద్ద ధర్నా కార్యక్ర మంలో పాల్గొనాలన్నారు. మండలంలో అనేక భూ సమస్యలు నెలకొన్నాయని, రీ సర్వేలో జరిగిన అవకతవకలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దుంపల ఏడుకొం డలు, కార్మిక సంఘం నాయకులు పెద్దపూడి వెంకయ్య, దేవా, తదితరులు పాల్గొన్నారు.



ప్రచార జాతలో పాల్గొన్న సీపీఎం నాయకులు

పూడిపర్తిలో పారిశుధ్య పనులు

వెంకటాచలం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడిపర్తిలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఈ కథనంపై ఎంపీడీవో కల్పన స్పందించి పూడిపర్తి పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావుకు పారిశుధ్యం మెరుగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సైడ్ కాలువల్లో పేరుకుపోయిన పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగింప చేశారు. పలు ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో రెండురో జులపాటు పారిశుధ్య పనులు చేపడుతామని తెలిపారు. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.



డ్రైనేజీ కాలువలో పూడికను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

93 స్పౌజ్ పింఛన్ల మంజూరు

మనుబోలు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలానికి కొత్తగా 93 స్పౌజ్ (భర్త చనిపోతే భార్యకు) పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో జలజాక్షి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 93 మందికి వచ్చే నెల 1నుంచి సామాజిక పింఛన్లతో పాటే రూ.4వేలు ఇస్తారని పేర్కొన్నారు. భర్తకు పింఛన్ వస్తూ చనిపోయి ఉంటే, దానిని భార్యకు దరఖాస్తు లేకుండా ఇచ్చేలా ప్రభుత్వం వీటిని మంజూరు చేసిందని తెలిపారు. దీంతో మండలంలో 5,617 మందికి పింఛన్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

గొలగమూడిలో భక్తుల సందడి

వెంకటాచలం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలగమూడి భగవాన్ వెంకయ్య స్వామి ఆశ్రమంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు మన రాష్ట్ర నలమూల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వెంకయ్య స్వామిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించారు. నిత్యం అన్నదానసత్రంలో ఈ ఒక్క రోజే సుమారు 20 వేల మందికి పైగా భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొ న్నారు. వెంకయ్యస్వామి ఆశ్రమా న్ని పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకం గా అలంకరించారు.

కబ్జా కోరల్లో చెరువులు

● పట్టించుకోని అధికారులు

పొదలకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు చెరువులు కబ్జా కోరల్లో చిక్కుకుని రూపురేఖలు కోల్పోతున్నాయి. మండలంలోని 30 పంచాయతీల పరిధిలో చిన్నవి, పెద్దవి కలిపి 60 చెరువుల వరకు ఉన్నాయి. పూర్తి మెట్ట ప్రాంతమైన పొదలకూరు ప్రాంతంలో గతంలో అన్ని చెరువులూ వర్షాధారంగానే నిండేవి. అయితే చెరువులకు నీరు సరఫరా చేసే వరద కాలువలను సైతం ఆక్రమించుకొని తమ పొలాల్లో కలుపుకున్నారు. అరకొరగా కురుస్తున్న వర్షాలకు చెరువులు పూర్తిస్థాయిలో నిండడంలేదు. దీంతో ఈప్రాంతంలో వరిసాగు నామమాత్రంగా మారింది. ఈ నేపథ్యంలో తెలుగుగంగ ఎడమ కాలువకు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయడమే గాక, డ్యామ్‌లో నీరుండడంతో సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎడమ కాలువకు నీరు వదలడంతో కొన్ని గ్రామాల్లోని చెరువులకు కూడా నీరందుతోంది. ఈ నేపథ్యంలో చెరువుల విస్తీర్ణం తగ్గి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. దీంతో చివరి ఆయకట్టు రైతులు పంట కోత దశలో నీరందక ఎండబెట్టుకుంటున్నారు. ఈవిషయమై నీటిపారుదల శాఖాధికారులకు పలుమార్లు రైతులు విన్నవించుకున్నా స్పందించడంలేదని వారు వాపోతున్నారు. మండల కేంద్రమైన పొదలకూరులో వరద కాలువలు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాగే నడిచెరువులో మట్టితోలుకొని ఇళ్లు నిర్మించుకుంటున్నారు. అంతేగాక పులికల్లు, కనుపర్తి, డేగపూడి, మొగళ్లూరు, నేదురుమల్లి, నల్లపాలెం, బిరదవోలు, ఇనుకుర్తి, నావూరు, పార్లపల్లి, బత్తులపల్లి గ్రామాల చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని ఆయకట్టు రైతులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసి ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి చెరువులకు హద్దులు చూపాలని వారు కోరుతున్నారు.



ఆక్రమణకు గురైన పొదలకూరు చెరువు

C.R.I.M.E N.E.W.S

థర్మల్ కేంద్రంలో పేలిన ఈహెచ్‌పీ బ్రేకర్

● కార్మికుడికి తీవ్రగాయాలు

ముత్తుకూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేలటూరులోని జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రంలో శనివారం జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు గాయపడ్డాడు. థర్మల్ కేంద్రంలోని బొగ్గు హ్యాండిలింగ్ సెక్షన్‌లో ఈహెచ్‌పీ బ్రేకర్ ప్రమాదవశాత్తు పేలి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సమీపంలో పనిచేస్తున్న కార్మికుడు శివరామప్రసా ద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి గమనించిన సమీపంలోని కార్మికులు శివరామ ప్రసాద్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తర లించారు. సమాచారం అందుకున్న కృష్ణపట్నం ఎస్‌ఐ జేపీ శ్రీని వాస్‌రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కృష్ణపట్నం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన శివరామప్రసాద్

రైల్లో నుంచి పడి గుర్తుతెలియని యువకుడి మృతి

మనుబోలు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మనుబోలు రైల్వేస్టేషన్ ఉత్తరం వైపు యార్డు సమీపంలో శనివారం ఓ గుర్తుతెలియని యువకుడు రైల్లో నుంచి పడి మృతి చెందాడు. విధుల్లో ఉన్న కీమెన్ గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రైల్వే ఎస్‌ఐ జీ.మాలకొండయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారుగా 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగిన గుర్తుతెలియని యువ కుడు 145వ కి.మీ వద్ద అప్‌లైన్‌లో మధ్యాహ్నం 3గంటల సమయంలో రైల్లో నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడు తెలుపుపై నల్లచారలు కలిగిన ఫుల్ చొక్కా, నలుపురంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. చాతిపై వంశీకృష్ణ అనే పచ్చబొట్టు ఉంది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిక్కవరప్పాడు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల మేరకు.. నెల్లూరు నగరంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మనోహర్, రాజాలు మోటర్ బైక్‌పై ఇస్కపాళేనికి వెళ్లి వస్తుండగా గొలగమూడి నుంచి తిక్కవరప్పాడు వైపు వస్తున్న కారు ఢీకొంది. ఈప్రమాదంలో బైక్ అదుపుతప్పి బోల్తాపడి ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గొలగమూడిలోని ఒక ప్రైవేటు క్లీనిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఓ పక్క అప్పులు.. మరో పక్క కుమార్తె వివాహం దగ్గర పడుతుండటంతో డబ్బులు ఎలా చేయాలన్న ఆలోచలు.. అన్నింటి గురించి ఆలోచిస్తూ ఓ వ్యక్తి ఆత్మ హత్య చేసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని డ్రైవర్స్ కాలనీలో ఉన్న షేక్ ఖతిముద్దీన్(40), నూర్జహాన్‌లు దంపతులు. వారికి కుమార్తె, కుమారుడు సంతానం. ఖతీముద్దీన్ ఉడ్‌కాంప్లెక్స్‌లో తోపుడు మిషన్‌లో కొయ్యపని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మూడు నెలల నుంచి ఖతీముద్దీన్‌కు పనులు లేకపోవడంతో బయట తీసుకున్న అప్పులు ఎలా తీర్చాలని నిత్యం బాధపడుతూ ఉండేవాడు. ఈ పరిస్థితుల్లోనే కుమార్తెకు సెప్టెంబరు నెలలో వివాహం నిశ్చయించుకున్నారు. ఓ పక్క ఇప్పటికే తీసుకున్న అప్పులు, మరో పక్క కుమార్తె వివాహంకు డబ్బులు ఎక్కడ నుంచి తేవాలని భార్యతో చెప్పుకొని బాధపడుతూ ఉండేవాడు. అప్పుల వారు ఇంటికి వస్తే ఇంట్లో లేనని చెప్పమని భార్యకు చెప్పేవారు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఖతిముద్దీన్ తల్లి జరీనా హోటల్‌లో పనికి వెళుతూ హాల్‌లో చూడగా కుమారుడు కుర్చీలో కూర్చొని ఫోన్ చూసుకో వడం మనించింది. ఉదయం 6 గంటల సమయంలో భార్య నిద్రలేచి చూసేసరికి హాలులోని సీలింగ్ ఫ్యాన్‌కు ఖతిముద్దీన్ చీరకు ఉరివేసుకొని వేలాడుతూ కన్పించాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో పడకగదిలో నిద్రిస్తున్న ఇద్దరు పిల్లలు, చుట్టుపక్కల వారు వచ్చి ఆయనను కిందకు దించి చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయాడని తెలిపారు. దీంతో భార్య వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన ఖతిముద్దీన్

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై వేదాయపాలెం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరు రూరల్ విజయలక్ష్మి నగర్‌లో బట్ట జయశేఖర్, గాయత్రి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ముగ్గురు కుమార్తెలు. జయశేఖర్ నారాయణ వైద్యశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. భార్యాభర్తలు గత కొంతకాలంగా గొడవలు పడుతున్నారు. గొడవ జరిగినప్పుడల్లా జయశేఖర్ ఇంట్లో నుంచి వెళ్లిపోతాను అంటూ చెప్పేవాడు. ఈ క్రమంలో ఈనెల 20వ తేదీ భార్యాభర్తలు ఇద్దరు గొడవపడగా భర్త ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో భార్య, పిల్లలు జయశేఖర్ కోసం బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో శనివారం భార్య వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ సమావేశంలో దొంగతనం

నెల్లూరు(క్రైం), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరా భవన్‌లో జరిగిన ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల విలేకర్ల సమావేశంలో గుర్తుతెలియని వ్యక్తులు పర్సు దొంగలించారని ఇచ్చిన ఫిర్యాదుపై చిన్నబజారు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ప్రజావలుకు లోకల్ స్టేట్ ఇన్‌చార్జిగా మొగళ్లూరు శ్రీనివాసరావు పనిచేస్తున్నారు. ఇటీవల నెల్లూరు నగరంలో ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల ప్రెస్‌మీట్ ఇందిరాభవన్‌లో జరిగింది. ప్రెస్‌మీట్‌ను కవర్ చేసేందుకు శ్రీనివాసరావు వెళ్లి ఫొటోలు తీస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఆయన పర్సును దొంగలించారు. దీంతో ఆయన చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	232
కోడిగుడ్ల ధర (100): 575	

కార్పొరేషన్‌లో ఏసీల మాయం...?

నెల్లూరు(సిటీ), జూన్ 28(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో రెండు ఏసీలు మాయమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం స్థానిక అధికారులు, ఉద్యోగుల్లో చర్చనీయాంశమైంది. కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగం వద్ద మినీకాన్ఫరెన్స్ హాల్లో ఇటీవల అధికారులు నూతన ఏసీలను ఏర్పాటు చేశారు. కాగా వీటి స్థానంలో తీసిన పాత ఏసీలు కార్యాలయంలో లేవంటూ ఉద్యోగులు గుర్తించారు. ఈ వ్యవహారం జరిగి కొన్ని రోజులు గడుస్తుండగా తాజాగా ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. కార్యాలయమంతా సీసీ కెమెరాలు, ప్రధాన ద్వారము వద్ద సెక్యూరిటీ సిబ్బంది ఉన్నప్పటికీ పాత ఏసీలు ఏమైయ్యాయి...? ఎవరు ఎత్తుకెళ్లారన్నది ఉత్కంఠగా మారింది. తాజాగా సెక్యూరిటీ సిబ్బంది మార్పులు చేసినట్లు సమాచారం. కార్యాలయం ఏసీలు మాయమవడం పై ఆశక్తి నెలకొంది.

బదిలీల్లో గందరగోళం..!

● అయినా ప్రశాంతంగా ముగిసిన సచివాలయ ఉద్యోగుల కౌన్సెలింగ్ ప్రక్రియ

నెల్లూరు(సిటీ), జూన్ 28(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగుల బదిలీ ప్రక్రియ శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ తంతు ప్రశాంతంగా జరిగినప్పటికీ కౌన్సిలింగ్ నిర్వహించిన తీరులో గందరగోళం నెలకొంది. ఉద్యోగుల జాయినింగ్ తేదీల్లో తేడాలు రావడం, అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అస్పష్ట త నెలకొనడంతో సీనియార్టీల వద్ద ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఇంతా జరుగుతున్న కార్పొరేషన్ అధికారులు కౌన్సెలింగ్ మొదలైనప్పటికీ ఉద్యోగుల సీనియార్టీ జాబితా లను అధికారికంగా విడుదల చేయకపోవడం ఉద్యోగుల్లో ఆగ్రహానికి గురి చేసింది. 2019 అక్టోబరు 10న ఉద్యోగులందరికీ ప్రభుత్వం ప్రొసిడింగ్స్ ఇవ్వగా వీరిలో కొందరు అదే నెల 2వ తేదీన జాయినింగ్ రిపోర్టు చూపి ఆశ్చర్యానికి గురి చేశారు. మరికొందరు రెండు నెలల ముందు ఆగస్టు లోనే జాయినింగ్ అయినట్లు చూపడం గమనర్హం. అదేమటని ఉద్యోగులను ప్రశ్నించగా తాము వలంటీర్లగా పని చేసిన కాలాన్ని కూడా జాయినింగ్ కింద చూపినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకు కలిపి కౌన్సెలింగ్ నిర్వహించడంతో కార్పొరేషన్ కార్యాలయం సందడిగా మారింది. ఈ కౌన్సెలింగ్‌లో మూడు కేటగిరీలుగా బదిలీలకు అవకాశాలు చూపగా వారందరికీ రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వు లు జారీ చేస్తామని సంబంధిత అధికారులు సచివాలయ ఉద్యోగులకు తెలిపారు.





బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు, హాజరైన సచివాలయాల ఉద్యోగులు

లేఅవుట్లను పరిశీలించిన కమిషనర్

రూరల్ పరిధిలోని గుండ్లపాళెం వద్ద సిటీప్లానింగ్ అధికారులతో కలిసి కమిషనర్ నందన్ లేఅవుట్ ప్రాంతాలను పరిశీలించారు. నిబంధనలు మేరకే లేఅవుట్లు నిర్మించాలని సూచించారు. అనంతరం 17వ డివిజన్‌లో పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం వీఆర్సీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి సదస్సు నిర్వహించారు.

విద్యుత్ సమస్యలకు పరిష్కారం : రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరురూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : సబ్‌స్టేషన్ల నిర్మాణం వల్ల గ్రామాలలో విద్యుత్ సమస్యలకు పరిష్కారం ఏర్పడుతుందని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వెల్లంటి గ్రామంలో రూ.3.11 కోట్లతో నిర్మించతలపెట్టిన నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో 60 రోజుల్లో నిర్మాణం పూర్తి చేసి వెల్లంటితో పాటు, గొల్లకందుకూరు, కందమూరు, సజ్జాపురం గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటు వస్తున్నామని చెప్పారు. కాగా కొత్తూరు ప్రాంత మాజీ కార్పొరేటర్, వైసీపీ నాయకులు తురక అనిత, సూరి దంపతులతో పాటు వారి మిత్ర బృందాన్ని నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. రానున్న వారం రోజుల్లో తన నియోజకవర్గంలోని వైసీపీ నాయకుల భారీ చేరికలు టీడీపీలోకి ఉన్నాయని తెలిపారు. అందరం కలిసి ఏకతాటిపై పనిచేసి ప్రజలకు మంచి పాలన అందించాలని పిలుపునిచ్చారు.



కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

భక్తులకు వసతులు కల్పించాలి

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యాలకు ప్రతిక అయిన బారాషహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కూటమి నాయకులు వసతులు కల్పించాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కోరారు. రొట్టెల పండుగ సందర్భంగా బారాషహీద్ దర్గా వద్ద ఏర్పాట్లను జనసేన పార్టీ నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆధ్వర్యంలో జరగనున్న రొట్టెల పండుగలోఅధికారులు నిత్యం పర్యవేక్షించాలన్నారు. కమిటీలో జనసేనకు అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యేకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, సుందరరామిరెడ్డి, దర్గా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆజాద్ జమీర్, కమిటీ సభ్యులు యస్దాని, సుల్తాన్, షఫీ తదితరులు పాల్గొన్నారు.



రొట్టెల పండుగ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జనసేన నేతలు

వేపదరువు పార్క్‌కి ఆనం వివేకానందరెడ్డి పేరు

● యోగా శిక్షణ, కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు ● రూ.75 లక్షలతో పార్క్ నిర్మాణం ● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(జడ్పీ), జూన్ 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలాజీ నగర్ వేపదరువు వద్ద స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి పేరుతో పార్క్‌ను నిర్మిస్తున్నామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పార్క్ పనులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న పార్క్ స్థలాన్ని గతంలో అనేక మంది ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేయగా మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వర్ ప్రసాద్ న్యాయస్థానాలను ఆశ్రయించి ఆక్రణలను అడ్డుకుని స్థలాన్ని కాపాడారన్నారు. ఈ స్థలంలో రూ.75 లక్షలతో నుడా ఆధ్వర్యంలో పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతానికి తొలి కౌన్సిలర్‌గా ఎన్నికై నగర ఎమ్మెల్యేగా సేవలందించిన స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి పేరును పార్క్‌కు పెడుతున్నామని తెలిపారు. పార్క్‌ను ఆహ్లాదంగా తీర్చిదిద్దడంతోపాటు ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్, యోగా సెంటర్, డ్రగ్స్ రౌడీయిజాలతో గాడితప్పిన యువతకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇది రాష్ట్రంలోనే తొలి కౌన్సెలింగ్ కేంద్రం అవుతుందని, దీని ద్వారా యువతకు మంచి మార్గం చూపించడమే లక్ష్యమన్నారు. మంత్రి పొంగూరు నారాయణ సహకారంతో గతంలో నగరంలో ఎన్టీఆర్ నక్లెస్ రోడ్డు, నందమూరి తారకరామారావు పార్క్, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పార్క్‌లతోపాటు మరికొన్ని పార్క్‌లను పెద్దఎత్తున అభివృద్ధి చేశామని వివరించారు. అలాగే ఈ దఫా మంత్రి నారాయణతోపాటు మంత్రి ఆనం రామానారాయణరెడ్డి, ఎమ్మెల్యేల సహకారంతో జిల్లా అంతాట నుడా ఆధ్వర్యంలో పెద్దఎత్తున పార్క్‌లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే పార్క్‌లో ఆనం వివేకానందరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఇకముందు ఏర్పాటు చేసే పార్క్‌లకు భవిష్యత్తు తరాల కోసం సేవలందించిన నేతల పేర్లను పెడతామని వివరించారు. అనంతరం స్థానికుడు కిషన్‌రావు మాట్లాడుతూ పార్క్ స్థలాన్ని ఆక్రమించేందుకు గతంలో ఎంతోమంది ప్రయత్నించినప్పటికీ నుడా చైర్మన్ వాటన్నింటిని అడ్డుకుని తమ ప్రాంతానికి పార్క్‌ను అందిస్తున్నారని, ఆయకు ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వర్ ప్రసాద్, నేతలు తానే మస్తాన్, పసుపులేటి మల్లికార్జున్, ఎలమందారెడ్డి, ఆకుల హనుమంత రావు, తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా ఉదయభాస్కర్‌రావు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 28(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రోటరీ క్లబ్‌కు శనివారం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడుగా తాటిపర్తి ఉదయ భాస్కర్‌రావు, కార్యదర్శిగా కొండపల్లి రవీంద్రనాథ్, రోటరీ సభ్యులు ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీజీఎన్‌పీ.కేశవరెడ్డి, రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డిలు పాల్గొని రోటరీ సేవలను కొనియాడారు. ప్రస్తుత రోటరీ క్లబ్ అధ్యక్షుడు బెజవాడ నరేష్ చంద్రారెడ్డి, కార్యదర్శి పీ.అభిషేక్‌రెడ్డిలు మాట్లాడుతూ తమ పదవీకాలంలో చేసిన సేవా కార్యక్రమాలు వివరించారు. వివిధ పాఠశాలలో ప్రతిభావంతులైన విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. బెస్ట్ ఆర్టీసీ డ్రైవర్‌గా వై.కృష్ణయ్యకు పురస్కార బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ మాజీ గవర్నర్‌లు, సభ్యులు పాల్గొన్నారు.



ప్రమాణం స్వీకరం చేసిన రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం

బదిలీల్లో పాధాన్యత ఇవ్వడం అభినందనీయం



రమణారెడ్డిని సన్మానిస్తున్న చేజర్ల సుధాకర్‌రావు

నెల్లూరు(వైద్యం), జూన్ 28(ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో ఇటీవల వివిధ కేడర్ల జరిగిన బదిలీల కౌన్సెలింగ్‌లో ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస)కు ప్రాధాన్యత ఇవ్వడం పట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాతకు అభినందనలు తెలుపుతున్నట్లు హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు వెల్లడించారు. నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీల కౌన్సెలింగ్‌లో హంసకు ప్రాధాన్యత ఇచ్చేందుకు వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కూడా కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సం ఘం జిల్లా అధ్యక్షుడుగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా వైద్య ఉద్యోగులకు విశిష్టసేవలు అందించి ఉద్యోగ విరమణ చే స్తున్న ఏనుడు రమణారెడ్డి సేవలు మరువలేనివన్నారు. ఈ సందర్భంగా రమణారెడ్డిని ప్రత్యే కంగా శాలువా, పు ష్పగుచ్ఛంతో సత్క రించారు. ఈ కార్య క్రమంలో రిటైర్డ్ ఎంప్లాయీస్ అసో సియేషన్ జిల్లా కార్యదర్శి కల్పం శ్రీనివాసులు, హంస జిల్లా కార్యదర్శి కమల్ కిరణ్, గౌరవ అధ్యక్షురాలు ఇందిర, జిల్లా నాయకులు మజురుల్లా, జయశ్రీ, గౌస్‌బాషా, ఖాదర్ మస్తాన్, పరిమళ, అరవ కుమారి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జట్టుకు ఆడాలి

● ఏసీఏ కామెంటేటరీల సంఘం చైర్మన్ కళ్యాణకృష్ణ

● మల్టీ డే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అనంతలో ఉండే వసతులు, సదుపాయాలను సద్వినియోగం చేసుకుని జాతీయ జట్టుకు ఆడే స్థాయికి చేరాలని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ)కామెంటేటరీల సంఘం చైర్మన్ కళ్యాణకృష్ణ ఆకాంక్షించారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ మల్టీడే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను శనివారం అనంతపురంలోని అనంత క్రికెట్ మైదానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కళ్యాణకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలిపోటీ అనంతపురం, కడప జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన కడప తొలి ఇన్నింగ్స్‌లో 76.5ఓవర్లలో 273పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్ వంశీకృష్ణ 86పరుగులు, జహీర్ అబ్బాస్ 85, జయవర్ధన్ 40 పరుగులు చేశారు. అనంత బౌలరు కమిల్ 3వికెట్లు పటగొట్టాడు. అనంతరం బరిలోకి దిగిన అనంత మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆరు ఓవర్లలో వికెట్ నష్టానికి 47పరుగులు చేసింది.

రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో కర్నూలు, చిత్తూరు జట్లు తలపడ్డాయి. కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 71.5ఓవర్లలో 250పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్లు సంజయ్‌నాయుడు 84పరుగులు, అశోక్‌కుమార్ 76 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్ మాధవ్ నాయుడు 3వికెట్లు, మల్లేషన్, ధరణికుమార్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు 12ఓవర్లలో 49 పరుగులకే 3వికెట్లు కోల్పోయింది. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, సహాయ కార్యదర్శి మురళీ కృష్ణ, కోశాధికారి షబ్బీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కళ్యాణకృష్ణ

ఘనంగా పీవీ నరసింహారావు జయంతి

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 28(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో శనివారం మనుమసిద్ధి నగర్‌లోని మాతృశ్రీ భవనంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పీవీ నరసింహారావు చిత్రపటానికి పుష్పమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. తెలుగు బిడ్డగా, అపర చాణక్యుడిగా దేశాన్ని తనదైన శైలిలో ఆర్థిక సంస్కరణల ద్వారా అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత ఆయనదని కొనియాడారు. రామాయణం మహేష్‌స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు బ్రాహ్మణ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ ఫర్నీచర్ ఎక్స్‌పో ప్రారంభం



అమ్మ ఫర్నీచర్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోలో ఫర్నీచర్ ప్రదర్శన

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 28(ఆంధ్రజ్యోతి) : నగరంలోని మినీ బైపాస్‌రోడ్డులోని జీపీఆర్ కల్యాణ మండపంలో ఇంటర్నేషనల్ ఎక్స్‌పో శనివారం ఘనంగా ప్రారంభమైంది. అమ్మా ఫర్నీచర్‌మాల్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ ఎక్స్‌పోను సంస్థ వ్యవస్థాపకుడు గడ్డం సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు గడ్డం సుజన్ మాట్లాడుతూ ఈ ఎక్స్‌పోలో అన్ని రకాల అధునాతన ఫర్నీచర్‌పై 50 శాతం వరకు రాయితీ అందిస్తున్నామని తెలిపారు. దేశ విదేశాల నుంచి ఎగుమతి చేసుకున్న ఫర్నీచర్ రకాలను వేయికి పైగా ఉంచామని ఈ ప్రదర్శన జూలై 2వతేదీ వరకు ఉంటుందని, నెల్లూరు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(జడ్పీ), జూన్ 28(ఆంధ్రజ్యోతి) : నగరంలోని మహాత్మగాంధీ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ మరమ్మతు పనుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఈఈఎం శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు డీకేడబ్ల్యూ కాలేజీ, నీలగిరి సంగం, బట్వాడిపాళెం సర్కిల్, ప్రశాంతినగర్, రూరల్ ఎంఆర్వో ఆఫీస్, జడ్పీ ఆఫీస్, అంబేద్కర్ నగర్, కేవీఆర్ పెట్రోల్ బంకు, బ్రహ్మానందపురం, బారాషాహిద్ దర్గా, కలెక్టర్ బంగ్లా, మున్సిపాలిటీ ఆఫీస్, బషీర్ నగర్, జేవీఆర్ కాలనీ, లేక్ వ్యూ కాలనీ, సుజాతమ్మ కాలనీ, లక్ష్మీ నరసింహపురం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు యథావిధిగా విద్యుత్ బిల్లుల వసూలు

నెల్లూరు(జడ్పీ), జూన్ 28(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని విద్యుత్ బిల్లులు వసూలు ఆదివారం సెలవు దినం అయినప్పటికీ అన్ని కేంద్రాలు యథావిధిగా పని చేస్తాయని విద్యుత్ శాఖ ఎస్ఈ వీ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులందరూ ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్‌లు

నెల్లూరు(విద్య), జూన్ 28(ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఐదురోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథిగా పాల్గొన్న తిరుపతి ఐఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విక్రమ్ కుమార్ పూడి మాట్లాడుతూ సెమీ కండక్టర్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్స్ విభాగాల విద్యార్థులకు కెరీర్ అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. వీఎల్ఎస్ఐ డిజైన్, చిప్ ఇంజనీరింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఏకీకరణతో చిప్ ఫ్యాబ్రికేషన్, డిజైన్ ఆటోమేషన్, సిస్టమ్ టెస్టింగ్, థర్మల్, స్ట్రక్చరల్ అనాలసిస్, హార్ట్‌వేర్, సాఫ్ట్‌వేర్ కోడిజైన్‌లలో నైపుణ్యం కలిగిన వారికి డిమాండ్ పెరుగుతోందన్నారు. ఈ విభాగాలకు చెందిన విద్యార్థులు ఏఐ సాధనాలు, వీఎల్ఎస్ఐ డిజైన్ పద్ధతుల్లో నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ఏ-1 ఆధారిత సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థలో ఆవిష్కరణలను నడిపించడంలో ఈసీఈ, ఈఈఈ, మెకానికల్ శాఖల నడుమ ఇంటర్ డిసిప్లిన రీ సహకారం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అనం తరం పలు అంశాలపై విద్యార్థుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీఎస్.శ్రీధర్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ కె.మురళి, అకడమిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.హజరత్తయ్య, సమన్వయకర్త డాక్టర్ కేఎస్.సాగర్‌రెడ్డి, సీఎస్ఈ హెడ్ డాక్టర్ సీ.రాజేంద్ర, ఈఈఈ హెడ్ డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, సీఈ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయం కూల్చివేయం దురదృష్టకరం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 28(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో దుర్గామాత ఆలయం కూల్చివేత దురదృష్టకరమని బీజేపీ నాయకులు మిడతల రమేష్ ఒక ప్రకటనలో విచారం వ్య క్తం చేశారు. భారత్‌లో బంగ్లాదేశీయులు స్వేచ్ఛ గా బతుకుతుంటే బంగ్లాదేశ్‌లో హింధువులు భయభ్రాంతులతో బతుకుతున్నారని తెలిపారు. సెక్యులరిస్టు మేధావులు హింధువుల రక్షణకు నోరువిప్పాలన్నారు. అర్థ శతాబ్ధం కాలంగా పూజలు జరుపుకుంటున్న దుర్గా మాత ఆలయాన్ని తీవ్రవాదుల బెదిరింపులతో బంగ్లా సర్కార్ కూల్చివేయడం శోచనీయమన్నారు.

న్యాయాధికారులకు వర్క్‌షాప్



దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు జడ్జి శ్రీనివాసులురెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్, తదితరులు

నెల్లూరు(లీగల్), జూన్ 28(ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న న్యాయాధికారులకు జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్జి, జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి కే.శ్రీనివాసులురెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పర్యవేక్షించారు. న్యాయాధికారులకు మాజీ న్యాయమూర్తులు సీతారామమూర్తి, బీ.శ్యామ్‌సుందర్ వివిధ అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, మున్సిపల్ కమిషనర్ వైవీ.నందన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కెనరా బ్యాంకు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సౌజన్యంతో దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేశారు.

జిల్లా పర్యటనకు వచ్చిన హైకోర్టు జడ్జి కే.శ్రీనివాసులురెడ్డిని జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు కలసి అపరిష్కృతంగా ఉన్న న్యాయశాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. పదోన్నతులకు సంబంధించిన నిబంధనలను సవరించాలని, విద్యార్హతల విషయంలో హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల అప్పీళ్లను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. స్పందించిన ఆయన త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి పీవీ.నారాయణరెడ్డి, కోశాధికారి పీవీ.సునీల్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ.శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు వీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై దృష్టి పెట్టాలి : డీఎల్‌డీవో



మనుబోలులో చెత్తసేకరణ పనులు పరిశీలిస్తున్న డీఎల్‌డీవో వసుమతి, ఎంపీడీవో జలజాక్షి

మనుబోలు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఇంటింటా చెత్త సేకరణపై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టాలని డీఎల్‌డీవో వసుమతి ఆదేశించారు. శనివారం ఆమె మనుబోలు పంచాయతీని సందర్శించారు. ఇంటింటా చెత్తసేకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటింటా చెత్త సేకరణపైన మండలంలో 7 పంచాయతీలపై ప్రజాభిప్రాయం (ఐవీఆర్ఎస్) సేకరిస్తోందన్నారు. అయితే మనుబోలు పంచాయతీలో చెత్తసేకరణ సరిగా జరగడం లేదంటూ 33శాతం మంది తెలిపారన్నారు. ప్రజలు ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చినప్పుడు క్షుణ్ణంగా విని వారి అభిప్రాయంను స్పష్టంగా నెంబర్ల రూపంలో తెలియజేయాలన్నారు. వినకుండానే నంబర్ నొక్కడం చేయరాదన్నారు. నిత్యం చెత్తసేకరణపై కార్యదర్శులకు సూచనలు చేస్తుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

పనిభారంతో సామూహిక సెలవులు



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రాపూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్‌శాఖలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు పని భారం తట్టుకోలేక రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు శనివారం సామూహిక సెలవు పెట్టినట్లు తెలిపారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ఎంపీడీవో మారెళ్ల భవానికు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం ఆరు గంటలకు పారిశుధ్య కార్మికులు చేపట్టే చెత్త సేకరణలో పాల్గొనాలని, అలాగే లైవ్ లోకేషన్‌తో పాటు వీడియో కాల్ చేయాలని, వీడియోలు తీసి పంపాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారన్నారు. దీంతో పని భారం తట్టుకోలేకపోతున్నామని వారు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 9,17,846

వలేటివారిపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 9,17,846 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 5,600, కుంకుమార్చన ద్వారా రూ. 18,640, వివాహముల ద్వారా రూ. 1000, తలనీలాలు ద్వారా రూ. 50,700, వాహనపూజలు ద్వారా రూ. 3,940, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 3,09,100, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 580, రూముఅద్దెలు ద్వారా రూ. 31,070, కవర్లు ద్వారా రూ. 6,600, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,08,375, అన్నదానం ద్వారా రూ. 2,75,125, విరాళముల ద్వారా రూ. 7,116 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ చంద్రశేఖర్ తెలియజేశారు.

బైక్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

తోటపల్లిగూడూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): స్కూటీపై వెళుతున్న షేక్.షబీనా మహాలక్ష్మీపురం నుంచి పల్సర్ బైక్‌పై ఎదురుగా వస్తున్న ఊటుకూరు నాగార్జునను ఢీకొనగా, అతనికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని వెంకన్నపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమీపంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ విషయమై నాగార్జున సోదరుడు విజయ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంలో విచారణ జరిపి న్యాయం చేయాలని తన ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు.

గ్రామసభల్లో సమస్యలు పరిష్కరించుకోండి

అల్లూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్క రించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ రజనీకాంత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 10 పంచాయతీల్లో జూలై 1వ తేదీన గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మండలంలోని ఇందుపూరు, పురిణి, తూర్పు గోగులపల్లి, గ్రద్దగుంట, ఇస్కపల్లి గ్రామాల్లో ఆయా గ్రామ సచివాలయాల వద్ద ఉదయం 10 గంట లకు, నార్తు ఆములూరు, బత్రకాగొల్లు, పడమర గోగులపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఉదయం 10 గంటలకు, బీరంగుంట గ్రామ సచివాలయం, వెలిచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 2గంటలకు సభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఈ సభల్లో తెలిపి పరిష్కరించుకోవాలని ఆయన తెలియజేశారు.

ఆర్థిక ప్రణాళికలో గణాంకాలే కీలకం

● విధానాల రూపకల్పనలోనూ వాటిదే విలువైన పాత్ర ● నేడు 29వ జాతీయ గణాంక దినోత్సవం

నెల్లూరు(హరనాథపురం), జూన్ 28(ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ప్రణాళిక, విధాన రూపకల్పనలో గణాంకాలదే విలువైనపాత్ర. గణాంకాల ప్రాముఖ్యతను వివరించేందుకు ఏటా జాతీయ గణాంకాల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. దివంగత ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహలనోబిస్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా జూన్ 29న (నేడు) జాతీయ గణాంకాల దినోత్సవాన్ని జరుపుతున్నారు. గణాంకాలు, ఆర్థిక ప్రణాళిక రంగాల్లో ఆయన చేసిన కృషికి గుర్తుగా ఈ కార్యక్రమాన్ని జరుపుకుంటున్నారు. చరిత్రను అనుసరించి చాణుక్యుడి కాలంలో ఏర్పడిన ప్రణాళికా విభాగం స్వతంత్ర భారత ప్రభుత్వ కాలంలో పంచవర్ష ప్రణాళికలతో మొదలైంది. పంచవర్ష ప్రణాళిక రచనలో మహలనోబిస్ పాత్ర ఎనలేనిది. అందుకే ఆయన జయంతిని గణాంక దినోత్సవంగా జరపడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అంతేకాకుండా దేశంలో మొదటి ప్రణాళిక సంఘం సభ్యులలో ఆయన ఒకరు. మొదటి ఐదేళ్లలో ప్రణాళికను రూపొందించటంలో ఆయన కీలకపాత్ర పోషించాడు. జాతీయ అభివృద్ధిలో అధికారిక గణాంకాల ప్రాముఖ్యతను హైలెట్ చేయడానికి సెమినార్లు, చర్చలు, పోటీలు నిర్వహించనున్నారు.

● ప్రజా పరిపాలనకు..

ప్రజా పరిపాలనకు అత్యంత ఆవశ్యకమైనవి జనాభాలెక్కలు.



పంట వివరాలు సేకరిస్తున్న గణాంకశాఖ అధికారులు (ఫైల్)

వర్షపాత వివరాలు, పంటకోత ప్రయోగాలు, వ్యవసాయ గణాంకాలు, పారిశ్రామిక గణాంకాలు, అభివృద్ధి సూచికలు, స్థూల ఉత్పత్తి అంచనాలు వంటి పలు గణాంకాలను మదింపు చేయటమే కాక, స్వర్ణాంధ్ర 2047 ప్రణాళిక రచనలో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక్ష పరిపాలనలో ప్రధాన భూమికను ఆంధ్రప్రదేశ్ అర్థగణాంక శాఖ పోషిస్తోంది. కేవలం అర్థగణాంక వాఖ ఉద్యోగులకే కాక, అన్నీ ప్రభుత్వ శాఖలకు గణాంకాలు కీలకమని తెలియచేస్తోంది. రాష్ట్ర అభివృద్ధిలో శాఖల వాటా, శాఖ పనితీరు సూచికల నిర్మాణం నుంచి ఉద్యోగుల డీఏ, పీఆర్సీ ఫిట్మెంట్ వరకు నిర్ధారణ వరకు గణాంక శాస్త్రం సేవలు ఉపయోగపడుతున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను గణాంకశాస్త్రం ఇందనం వంటింది. నాటి గణన యంత్రం తయారీ నుంచి నేటి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ యంత్రాంగం వరకు గణాంక శాస్త్రం లేదా డేటా సైన్సు కీలకమని పేర్కొంటూ, గణాంక శాస్త్రం మీద పట్టు సాధించిన ఐటీ విద్యారులు ఆధునిక ప్రపంచాన్ని దిశానిర్దేశం చేస్తున్నారు.

గణాంక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం



జిల్లా వ్యాప్తంగా జాతీయ గణాంకాన్ని ఆదివారం ఘనంగా నిర్వహిస్తాం. ఐటీ రంగానికి అనుబంధంగా గణాంశాస్త్రాన్ని విద్యార్థులు శ్రద్ధగా అభ్యసించాలి. అర్థగణాంకశాఖ, ఉద్యోగులకే కాక, అన్నీ ప్రభుత్వశాఖలకు కీలకం.

\- పీవీఎస్‌టీ రాంప్రసాద్, ఏపీజీఈఏ జిల్లా కార్యదర్శి

ఆదాయపు బాటలో అర్బన్ బ్యాంకు

● షేర్ హోల్డర్‌లకు 12 శాతం డివిడెండ్
● మహాజనసభలో అరిగెల నాగేంద్రసాయి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 28(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లాభాలబాటలో ఉందని ఆ బ్యాంకు చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి చెప్పారు. శనివారం నగరంలోని టౌన్‌హాల్లో ఆ బ్యాంకు 109వ మహాజనసభ జరిగింది. ఈ సందర్భంగా నాగేంద్రసాయి మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో తమ బ్యాంకు రూ.80 లక్షల ఆదాయంలో ఉందన్నారు. ఆదాయ బాట పట్టడంతో బ్యాంకు షేర్ హోల్డర్‌లకు 12 శాతం డివిడ్ అందచేస్తామని చెప్పారు. సహకార రంగంలో నెల్లూరు నగంలో 109 ఏళ్ల చరిత్ర కలిగిన తమ బ్యాంకు రిజర్వుబ్యాంకు నిబంధనలకు అనుగుణంగా ఖాతాదారులకు సేవలందిస్తోందని చెప్పారు. జాతీయ బ్యాంకులకంటే అత్యధిక వడ్డీని డిపాజిట్లపై అందిస్తోందన్నారు. 2017లో చైర్మన్‌గా తాను బాధ్యతలు స్వీకరించక ముందు తమ బ్యాంకు ఎన్‌పీఓ 20 శాతానికి పైబడి ఉండేదని పేర్కొన్నారు. ఈ శాతాన్ని 4 శాతానికి తగ్గించి ఆర్బీఐ మెప్పును సాధించామని తెలిపారు. డిపాజిట్లపై 9శాతం వరకు వడ్డీని అందచేస్తూ ప్రజా మన్ననలను తమ బ్యాంకు చూరగొంటోందన్నారు. ఎన్‌పీఏను జీరోశాతానికి తీసుకొచ్చేలా పనిచేస్తామని వివరించారు. అన్ని రంగాలు, వర్గాల వారికి ఇతోధికంగా రుణాలు అందచేస్తున్నామని చెప్పారు. రుణాలు తీసుకున్నవారు సకాలంలో చెల్లించి కొత్త రుణాలు తీసుకోవచ్చని తెలిపారు. ఇలా చేయటం వలన డిపాజిట్లపై వడ్డీని పెంచే వీలుందన్నారు. అర్బన్ బ్యాంకును లాభాల బాటలో పయనింప చేయటమేకాక నెల్లూరు నగరం, రూరల్‌లో కొత్త బ్రాంచీల ఏర్పాటు త్వరలో జరుగుతుందన్నారు. మహాజనసభకు ముందు అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని సహకార పతాకాన్ని టౌన్‌హాల్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు సీఈవో మాగుంట అనిత, డైరెక్టర్లు నలగండ్ల శ్రీనాథ్, కె.వినోదిని, ఎస్.మహేశ్వరి, జయకోటేశ్వరరావు, ఎం.ప్రభాకర్‌రెడ్డి, అమర్ ఖాసీం, ఏ.నాగలక్ష్మి, కనుపర్తి శ్రీనివాసమూర్తి, కంచి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మహాజనసభలో మాట్లాడుతున్న చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి

కలుగోళ శాంభవికి ఆషాఢ మాసం సారె



శాంభవి అమ్మవారికి సారె తీసుకెళ్తున్న మహిళలతో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కావలి గ్రామదేవత కలుగోళ్ల శాంభవి అమ్మవారికి ఆషాఢమాసం సందర్భంగా మహిళలు సారె సమర్పణ కార్యక్రమం శనివారం చేపట్టారు. భ్రమరాంబిక సేవాసమితి, చీరాల, కావలి సేవా బృందం ఆధ్వర్యంలో మహిళలు స్థానిక లతా థియేటర్ వద్ద ఉన్న గంగమ్మతల్లి ఆలయం నుంచి కలుగోళ్ల శాంభవి ఆలయం వరకు పట్టు వస్త్రాలు సారెతో ఊరేగింపుగా వెళ్లగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి మహిళల సారెతో అమ్మవారి ప్రతిమను తీసుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో పాటు సారె తెచ్చిన వారికి కలుగోళ్లశాంబవి ఆలయంలో ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి సారెను సమర్పించారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత లెజండ్ సభ్యులు. మహిళలు, భక్తులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల పేరుతో

ప్రజలపై భారం మోపొద్దు



పోస్టర్లు విడుదల చేసిన సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్. తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారం మోపగం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. శనివారం బుచ్చిరెడ్డిపాళెంలోని స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పేరుతో వినియోగదారులపై పగలు ఒకరేటు, రాత్రులు ఒకరేటుతో అధిక బిల్లులు పడే విధంగా మీటర్లలోనే అమర్చారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ఆపకపోతే త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ వెళ్ళి స్మార్ట్ మీటర్లు వద్దు, కరెంటు బిల్లు తగ్గించాలి అంటూ ప్రచారం నిర్వహించి అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజు, జిల్లా కమిటీ సభ్యులు పట్టణ కార్యదర్శి పి. శ్రీనివాసులు, మండల కార్యదర్శి జి. శ్రీనివాసులు,సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్. మల్లికార్జున, సీపీఎం కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పెంచలోరి కల్యాణం



కల్యాణోత్సవంలో ఉత్సవమూర్తులు

రాపూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత నృసింహ స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, భక్తుల కోలాహలం, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణం జరిగింది. అలాగే స్వామికి పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి నిత్యపూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, ఊంజల్ సేవ అనంతరం క్షేత్రోత్సవం ఘనంగా నిర్వహించామని, భక్తులకు ఉచిత ప్రసాదం, అన్నప్రసాదాలు అందించామని ఆలయ ఏసీ పోరెడ్డి శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

కనుల పండువగా అక్షరాభ్యాసం



శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో విలు విద్య అలంకారం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 28(ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట ద్రౌపదీదేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఉదయం భగవద్గీత పారాయణం, చప్పర ఉత్సవం, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం విశేష పూజలు అనంతరం అక్షరాభ్యాసం, విలు విద్య అలంకారం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా మహాభారతం ప్రవచనం, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమాలను ఉభయకర్తలు, ఉత్సవ కమిటీ, ఈవో యు.జానకి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

విధులకు డుమ్మా : బోసిపోయిన సచివాలయం



తాళాలు తెరుచుకోని సచివాలయం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరిపై అధికారులు పలుమార్లు హెచ్చరిస్తున్నప్పటికీ వారిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. మండల కేంద్రానికి శివారు ప్రాంతం కావడంతో అధికారుల తనిఖీలు ఉండవనే ధీమాతో కొందరు ఉద్యోగులు ప్రతినిత్యం విధులకు డుమ్మా కొడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. శనివారం సైతం అలాంటి సంఘటనే జీ.కొండారెడ్డిపల్లి గ్రామ సచివా లయంలో చోటు చేసుకుంది. ఆ సచివాలయ పరిధిలో 7మంది ఉద్యోగులకు గానూ కేవలం వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసు మాత్రమే హాజరయ్యారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతోంది. ఉద్యోగుల గదులకు ఉండే తాళాలు కూడా తెరచుకోకపోవడంతో అటు ఉద్యోగులు, ఇటు ప్రజలు కనిపించక ఆ సచివాలయం బోసిపోయింది. అధికారులు హెచ్చరించినా, ఎవరెన్ని చెప్పినా డోంట్‌కేర్ అంటూ అక్కడి ఉద్యోగులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించడం విశేషం. మరికొంతమంది అయితే చుట్టపు చూపుగా ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి. దీంతో ప్రభుత్వ సేవలు సకాలంలో ప్రజలకు అందడం లేదనే ఆరోపణలు సైతం గుప్పుమంటున్నాయి.

సాదాబైనామాకు పరిష్కారమెప్పుడో...?

● ఏళ్ల తరబడి తప్పని తిప్పలు
● కూటమి ప్రభుత్వంపైనే రైతుల ఆశలు

ఉదయగిరి రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూములపై నేటికీ పూర్తిస్థాయి హక్కులు కల్పించుకోలేక పలువురు రైతులు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అప్పట్లో ఆర్థికంగా రిజిస్ట్రేషన్ల భారం భరించలేని కొంతమంది కేవలం స్టాంపు పేపర్లు, తెల్లకాగితాలను క్రయ, విక్రయాలకు ఆధారంగా చేసుకొని భద్రపరుచుకున్నారు. అలాంటి కాగితాలనే అధికారికంగా సాదాబైనామాలుగా వ్యవహరిస్తున్నారు. వాటినే సర్వహక్కులుగా భావించిన పూర్వీకులు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. అందుకు భిన్నంగా ప్రస్తుత పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పట్టాదారు పాసుపుస్తకాల కోసం కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారులు చెబుతుండడంతో చేసేదేమిలేక వెనుతిరగాల్సిన దుస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో అప్పు చేసి కొనుగోలు చేసిన భూములు కాపాడుకోవడం తలకుమించిన భారంగా మారుతుందని రైతులు వాపోతున్నారు. అలాంటి భూములు ఒకవైపు కళ్లెదుటే ఆక్రమణలకు గురవుతుండగా, మరోవైపు ధనార్జనే ధ్యేయంగా అమ్మకాలు సాగించిన వ్యక్తుల వారసులు అడ్డంకులు పెడుతుండడంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

● తప్పని తిప్పలు

గ్రామాల్లో నిర్వహిస్తున్న రీ సర్వేలోను అధికశాతం వినతులు సాదాబైనామాలకు చెందినవే ఉండడం గమనార్హం. వాటిపై దృష్టి సారిస్తే దాదాపుగా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని అధికారులు సైతం భావిస్తున్నారు. అయితే ఏళ్ల తరబడి ఎలాంటి సమస్యలు లేకుండా ఉన్నప్పటికీ ఇటీవల ఉమ్మడి కుటుంబాల విభజన, భూ రికార్డుల నవీకరణ తదితర పరిణామాలతో పరిస్థితులు ఇబ్బందికరంగా మారుతున్నాయి. కనీసం ఆన్‌లైన్ చేయించుకొనే అవకాశం కూడా లేకపోవడంతో అమ్మకాల సమయంలో సరిహద్దు తగాదాలు, భూములపై హక్కు లేకపోవడం వంటి సమస్యలతో భూములు తమ ఆధీనంగా ఉన్నప్పటికీ అవసరాల నిమిత్తం అమ్ముకొనే అవకాశం లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక గత భూ రికార్డులను ఆధారంగా చేసుకొని హక్కుదారుల వారసులకే పట్టాలు అంద చేస్తామని అధికారులు చెబుతుండడంతో బెంబేలెత్తిపోతున్నారు. అదే అదునుగా భావించిన కొంతమంది సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన వారికి భూములు అప్పగించేందుకు వెనకడుగు వేస్తున్నారు. కొంతమంది ప్రస్తుత మార్కెట్ ప్రకారం అధిక నగదు వసూలుకు పాల్పడుతుండగా, మరికొంతమంది రిజిస్ట్రేషన్లు చేసేందుకు వెనకడుగు వేస్తుండడంతో పరిస్థితి మరీంత దారుణంగా మారుతుంది.

● ఆశలన్నీ కూటమిపైనే

ఈ పరిస్థితుల నేపథ్యంలో రైతులు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు నింపుకొని ముందుకు సాగుతున్నారు. 2010లో అప్పటి ప్రభుత్వం దరఖాస్తులకు అవకాశం కల్పించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అనంతరం టీడీపీ ప్రభుత్వం సైతం ఐదెకరాల మెట్ట, 2.5 ఎకరాల మాగాణి భూములను క్రమబద్ధీకరించుకొనేందుకు మార్గదర్శకాలు విడుదల చేసింది. అలాంటి తరుణంలో 2019 ఎన్నికలు రైతుల పాలిట శాపంగా మారాయి. అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం రీసర్వే పేరుతో హడావుడి చేసిందే తప్ప సదాబైనామాలపై ఎలాంటి దృష్టి సారించనేలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం ఇటీవల మండలాల వారీగా పరిస్థితిని అంచనా వేయడంతో సమస్యకు పరిష్కారం లభించనుంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 80వేల మంది దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారులు నిర్ధారించారు. త్వరలోనే తిరిగి దరఖాస్తులకు అవకాశం కల్పించి గ్రామసభల ద్వారా నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది. దీంతో విషయం తెలుసుకున్న రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



ఉదయగిరి తహసీల్దారు కార్యాలయం

విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం

పాఠశాలలకు చేరని పాఠ్యపుస్తకాలు

వలేటివారిపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు పునఃప్రారంభమై 18 రోజులు దాటినప్పటికీ విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగా పాఠ్యపుస్తకాలు నేటికీ పూర్తిస్థాయిలో పాఠశాలలకు చేరలేదు. వలేటివారిపాలెం ఎంఆర్సీ భవనంలోనే నిల్వ ఉన్నాయి. వలేటివారిపాలెం మండలంలో 41 ఎంపీపీ స్కూళ్లు, 4 ఎంపీయూపీ స్కూళ్లు, 4 హైస్కూళ్లు, 1 మోడల్‌స్కూల్, 1 కేజీబీవీ స్కూల్ ఉంది. ఆ పాఠశాలలో 2511 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, విద్యామిత్ర కిట్లు విద్యార్థులకు పంపిణీ చేయకుండా ఎంఆర్సీ భవనంలోనే నిల్వ చేసి ఉన్నారు. దీంతో పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యామిత్ర కిట్లు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యాశాఖాధికారులు స్పందించి పాఠ్యపుస్తకాలు, విద్యామిత్ర కిట్లు అందజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైభవంగా నాగార్పమ్మ ఉత్సవాలు

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నంవారిచింతలలో శనివారం శ్రీనాగారప్పమ్మ ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు అమ్మ వారికి గణపతి పూజ, కలశ స్థాపన, పుణ్యాహవచనం, నవ గ్రహ మండపారా ధన, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక వాహనంలో కొలువుదీర్చి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. ఆదివారం గ్రామ సమీపంలో గల వనంలో పొంగళ్ల కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9200
వెండి కిలో ధర	రూ. 108900
వెండి ఒక గ్రాము	రూ. 111.90

విద్యార్థుల నమోదు శాతం పెంచాలి

ఉదయగిరి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని ఎంపీడీవో అప్పాజీ, ఎంఈవో-2 శ్రీనివా సులు తెలిపారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సీఆర్ఎంటీలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా గ్రామా ల్లో బడి ఈడు కలిగిన పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మండలంలోని తొమ్మిది ఉన్నత పాఠశా లల్లో 1వ తరగతి విద్యార్థుల నమోదు జరగాల్సి ఉందని, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించి పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరారు.

మహిళా సర్పంచులకు ముగిసిన శిక్షణ తరగతులు

ఆత్మకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు డివిజన్ పరిధిలోని మం డలాలకు సంబంధించిన మహిళా సర్పం చ్‌లకు స్థానిక స్వపరిపాలనలో మహిళా సాధికారిత గ్రామీణాభివృద్ధి దిశగా మా ర్పుపై స్థానిక మండల పరిషత్ కార్యా లయంలో మూడురోజులుగా నిర్వహి స్తున్న శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఎంపోటీలు మహ్మద్ జీలానీబాగ్, పీ. శ్రీవిద్యమహిళా సర్పం చులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా మహిళా సర్పంచులలో ఆత్మస్థైర్యం నింపి వారి విధులు, బాధ్యతలను గుర్తు చేసి నాయకత్వపటిమను పెంపొందించాల న్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల మెరుగుదల కోసం అధికారులను సమన్వయం చేసుకుని ప్రణాళికలు రూపొందించు కోవాలని సూచించారు.

వెళ్లే వారే కాని.. వచ్చేవారే లేరు...

● ఇన్‌చార్జ్‌ల పాలనలో వ్యవసాయం సాగేనా!?

ఉదయగిరి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అసలే మెట్ట ప్రాంతం.. పంటల సాగూ అంతంత మాత్రమే.. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయాధికారులు, సిబ్బంది రైతులను ప్రోత్సహించి సాగు విస్తీర్ణం చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇక్కడ రెగ్యులర్ వ్యవసాయ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న వారు పట్టణాలవైపు మొగ్గు చూపారు. అయితే జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయాధికారులు మెట్ట ప్రాంతంపై చిన్నచూపు చూశారు. ఏ ఒక్క వ్యవసాయాధికారి ఇక్కడి మండలాలను కోరుకోలేదు. దీంతో ఇన్‌చార్జ్‌ల పాలనలో వ్యవసాయం గట్టెక్కేనా అంటూ పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లో మర్రిపాడు, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, ఉదయగిరి మండలాలు ఉన్నాయి. జిల్లాలో అన్ని మండలాల కంటే మెట్ట ప్రాంతంలో ఆరుతడి పంటలతో పాటు ఉద్యాన పంటలు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. ఇలాంటి తరుణంలో ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులతో



ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయం

పాటు అన్ని మండలాలకు వ్యవసాయాధికారులుగా ఇన్‌చార్జ్‌లే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బదిలీల్లో ఉదయగిరికి ఏడీఏను నియమించినా ఆమె ఇంకా బాధ్యతలు స్వీకరించలేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడంతో ఉన్నతాధికారులకు ఆయా మండలాలకు ఆఘమేఘాలపై ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏడీఏమైనా ప్రభుత్వ అధికారులు మెట్ట ప్రాంతంపై చిన్నచూపు చూడడం తగదంటూ పలువురు ఆరోపిస్తున్నారు.

ఎస్సీ యువతకు ఉచిత శిక్షణ

ఉదయగిరి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్(ఎన్‌ఏసీ) శిక్షణ కేంద్రంలో డిజిటల్ మార్కెటింగ్ అసిస్టెంట్ కోర్సులో ఎస్సీ యువతకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేంద్రం నిర్వాహకులు ఎల్.ప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేయడంతో పాటు సంబంధిత రంగాల్లో ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9177327797 నెంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

గొలగమూడిలో భక్తుల సందడి

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన గొలగమూడి భగవాన్ వెంకయ్య స్వామి ఆశ్రమంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతోపాటు మన రాష్ట్ర నలమూల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వెంక య్య స్వామిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. వెంకయ్య స్వామి ఆశ్రమంలో నిత్యం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అందులో భాగంగా శనివారం ఒక్క రోజే సుమారు 20 వేల మందికి పైగా భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి అంకాళమ్మ మహోత్సవాలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ది రెడ్డిపల్లిలో వెలసి ఉన్న శ్రీ అంకాళమ్మతల్లి మహోత్సవాలను ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అందులో భాగంగా తొలిరోజు నిలుపు ఘట్టపు కడవ మహోత్సవం, గ్రామోత్సవం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే 30న గ్రామోత్సవం జూలై 1న సిరిమాను మహోత్సవం, 2న గ్రామోత్సవం, కొర్లబండి మహోత్సవం, 3న పొంగళ్ల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తుల



మహోత్సవాలకు ముస్తాబైన ఆలయం

సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలను సైతం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ పటిష్టతే లక్ష్యం



బీజేపీలోకి ఆహ్వానిస్తున్న సీనియర్ నాయకుడు కరటంపాటి సుధాకర్

ఆత్మకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలో బీజేపీ పటిష్టతే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని బీజేపీ సీనియర్ నాయకుడు కరటంపాటి సుధాకర్, పట్టణ కన్వీనర్ సున్నా సంతోష్‌కుమార్ తెలిపారు. 19వ వార్డుకు చెందిన పీ తిరుపతయ్య, వరలక్ష్మి, షేక్‌బాబు, బీ. సుబ్బరాయుడులకు వారు పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ మునిసిపాలిటీ అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. భారతదేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పదకొండు ఏళ్లుగా అహర్నిశలు సేవలందిస్తూ, పేదల సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన దిశగా పలు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పిస్తున్నామని వారు తెలిపారు.

మెరుగైన సేవలను అందించడమే లక్ష్యం

● డీఈఈ భానునాయక్



విద్యుత్ భద్రతా సూత్రాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఈ భానునాయక్

ఆత్మకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందు కెళ్తున్నామని విద్యుత్‌శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం భానునాయక్ తెలిపారు. శనివారం జాతీయ విద్యుత్ భద్రత వారోత్సవాలను నిర్వ హించి విద్యుత్ భద్రతా సూత్రాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయానికి అనుకూలంగా ప్రతిరోజు 9 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరా యం లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని విద్యుత్‌శాఖ అధికారులకు, సిబ్బందికి సూచించారు. వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని కోరారు. విద్యుత్ తీగల కింద చెట్లు ను పెంచకూడదని, విద్యుత్ పరికరాలకు పిల్లలను దూరంగా ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈ చిన్నస్వామినాయక్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాను

సద్వినియోగం చేసుకోండి

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతీ యువకులకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఈనెల 30వతేదీ బొమ్మరాజుచెరువు సమీపంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పలు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ (హెచ్‌టీపీఎస్://ఎన్‌ఏఊపీయూఎన్‌వై ఏఎం.జీవోవి.ఈఎన్/యూఎస్ఈఆర్)లో నమోదు చేసుకోవాలన్నారు.

ఉదయగిరి: వింజమూరులోని నేతాజీ డిగ్రీ కళాశాలలో ఈనెల 30వ తేదీన నిర్వహించే జాబ్‌మేళాను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, టీఎన్‌టీయూసీ నియోజక వర్గ అధ్యక్షుడు బొజ్జా శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ జాబ్‌మేళాను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాత

సంగం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమనతిప్ప మోడల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సంగం గ్రామానికి చెందిన దాత వేమా మల్లికార్జునరావు, ఆయన కుటుంబ సభ్యులు శనివారం నోటు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. దీంతో ప్రధానోపాధ్యాయులు మాల్యాద్రి దాతను, వారి కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తకు సన్మానం



శాస్త్రవేత్తను సన్మానిస్తున్న అధ్యాపకులు

ఉదయగిరి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల సందర్శనకు వచ్చిన నెల్లూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, విశ్వవిద్యాలయ విభాగాధిపతి డాక్టర్ మిట్ట చిన్నఓబయ్యను శనివారం కళాశాల అధ్యాపకులు సన్మానించి జ్ఞాపికలు అందజేసింది. చిన్నఓబయ్య ఉదయగిరి ప్రాంతానికి చెందిన వారు కావడం, దీంతో పాటు ఈనెల 30న ఉద్యోగ విరమణ పొందుతుండడంతో ఈ సన్మానం చేసినట్లు కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ గోపికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్, కిషన్‌తేజ్, రాజేశ్వరి, క్రాంతి, సూర్యకమలప్రియ, చంద్రబాబు, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

కూలిపోతేగాని స్పందించరా!?

మండలంలోని మర్రిపాడు పొలాల్లో కొంత కాలంగా విద్యుత్ స్తంభం వాలిపోయి ప్రమాదకరంగా ఉంది. గాలి వీస్తేనే పడిపోయే స్థితిలో ఉంది. అయినా అధికారులు పట్టించు కోవడం లేదు. స్తంభం కూలి పోయి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)



C.R.I.M.E N.E.W.S

థర్మల్ కేంద్రంలో పేలిన ఈహెచ్‌పీ బ్రేకర్

● కార్మికుడికి తీవ్రగాయాలు



గాయపడిన శివరామప్రసాద్

ముత్తుకూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేలటూరులోని జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రంలో శనివారం జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు గాయపడ్డాడు. థర్మల్ కేంద్రంలోని బొగ్గు హ్యాండిలింగ్ సెక్షన్‌లో ఈహెచ్‌పీ బ్రేకర్ ప్రమాదవశాత్తు పేలి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సమీపంలో పనిచేస్తున్న కార్మికుడు శివరామప్రసా ద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి గమనించిన సమీపంలోని కార్మికులు శివరామ ప్రసాద్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తర లించారు. సమాచారం అందుకున్న కృష్ణపట్నం ఎస్ఐ జేపీ శ్రీని వాస్‌రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కృష్ణపట్నం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో నుంచి పడి గుర్తుతెలియని యువకుడి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మనుబోలు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మనుబోలు రైల్వేస్టేషన్ ఉత్తరం వైపు యార్డు సమీపంలో శనివారం ఓ గుర్తుతెలియని యువకుడు రైల్లో నుంచి పడి మృతి చెందాడు. విధుల్లో ఉన్న కీమెన్ గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రైల్వే ఎస్ఐ జీ.మాలకొండయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారుగా 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగిన గుర్తుతెలియని యువ కుడు 145వ కి.మీ వద్ద అప్‌లైన్‌లో మధ్యాహ్నం 3గంటల సమయంలో రైల్లో నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడు తెలుపుపై నల్లచారలు కలిగిన ఫుల్ చొక్కా, నలుపురంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. చాతిపై వంశీకృష్ణ అనే పచ్చబొట్టు ఉంది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిక్కవరప్పాడు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల మేరకు.. నెల్లూరు నగరంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మనోహర్, రాజాలు మోటర్ బైక్‌పై ఇస్కపాళేనికి వెళ్లి వస్తుండగా గొలగమూడి నుంచి తిక్కవరప్పాడు వైపు వస్తున్న కారు ఢీకొంది. ఈప్రమాదంలో బైక్ అదుపుతప్పి బోల్తాపడి ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గొలగమూడిలోని ఒక ప్రైవేటు క్లీనిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన ఖలీముద్దీన్

నెల్లూరు(క్రైం), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఓ పక్క అప్పులు.. మరో పక్క కుమార్తె వివాహం దగ్గర పడుతుండటంతో డబ్బులు ఎలా చేయాలన్న ఆలోచలు.. అన్నింటి గురించి ఆలోచిస్తూ ఓ వ్యక్తి ఆత్మ హత్య చేసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని డ్రైవర్స్ కాలనీలో ఉన్న షేక్ ఖలీముద్దీన్(40), నూర్జహాన్‌లు దంపతులు. వారికి కుమార్తె, కుమారుడు సంతానం. ఖలీముద్దీన్ ఉడ్‌కాంప్లెక్స్‌లో తోపుడు మిషన్‌లో కొయ్యపని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మూడు నెలల నుంచి ఖలీముద్దీన్‌కు పనులు లేకపోవడంతో బయట తీసుకున్న అప్పులు ఎలా తీర్చాలని నిత్యం బాధపడుతూ ఉండేవాడు. ఈ పరిస్థితుల్లోనే కుమార్తెకు సెప్టెంబరు నెలలో వివాహం నిశ్చయించుకున్నారు. ఓ పక్క ఇప్పటికే తీసుకున్న అప్పులు, మరో పక్క కుమార్తె వివాహంకు డబ్బులు ఎక్కడ నుంచి తేవాలని భార్యతో చెప్పుకొని బాధపడుతూ ఉండేవాడు. అప్పుల వారు ఇంటికి వస్తే ఇంట్లో లేనని చెప్పమని భార్యకు చెప్పేవారు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఖలీముద్దీన్ తల్లి జరీనా హోటల్‌లో పనికి వెళుతూ హాల్‌లో చూడగా కుమారుడు కుర్చీలో కూర్చొని ఫోన్ చూసుకో వడం మనించింది. ఉదయం 6 గంటల సమయంలో భార్య నిద్రలేచి చూసేసరికి హాలులోని సీలింగ్ ఫ్యాన్‌కు ఖలీముద్దీన్ చీరకు ఉరివేసుకొని వేలాడుతూ కన్పించాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో పడకగదిలో నిద్రస్తున్న ఇద్దరు పిల్లలు, చుట్టుపక్కల వారు వచ్చి ఆయనను కిందకు దించి చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయాడని తెలిపారు. దీంతో భార్య వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై వేదాయపాలెం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ విజయలక్ష్మి నగర్‌లో బట్ట జయశేఖర్, గాయత్రి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ముగ్గురు కుమార్తెలు. జయశేఖర్ నారాయణ వైద్యశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. భార్యాభర్తలు గత కొంతకాలంగా గొడవలు పడుతున్నారు. గొడవ జరిగినపుడల్లా జయశేఖర్ ఇంట్లో నుంచి వెళ్లిపోతాను అంటూ చెప్పేవాడు. ఈ క్రమంలో ఈనెల 20వ తేది భార్యాభర్తలు ఇద్దరు గొడవపడగా భర్త ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో భర్య, పిల్లలు జయశేఖర్ కోసం బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో శనివారం భార్య వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ సమావేశంలో దొంగతనం

నెల్లూరు(క్రైం), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరా భవన్‌లో జరిగిన ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల విలేకర్ల సమావేశంలో గుర్తుతెలియని వ్యక్తులు పర్సు దొంగలించారని ఇచ్చిన ఫిర్యాదుపై చిన్నబజారు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ప్రజాపలుకు లోకల్ స్టేట్ ఇన్‌చార్జిగా మొగళ్లూరు శ్రీనివాసరావు పనిచేస్తున్నారు. ఇటీవల నెల్లూరు నగరంలో ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల ప్రెస్‌మీట్ ఇందిరాభవన్‌లో జరిగింది. ప్రెస్‌మీట్‌ను కవర్ చేసేందుకు శ్రీనివాసరావు వెళ్లి ఫొటోలు తీస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఆయన పర్సును దొంగలించారు. దీంతో ఆయన చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	232

కోడిగుడ్ల ధర (100): 575

ఉపాధి హామీ పనుల పరిశీలన

వలేటివారిపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కళవళ్లలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శనివారం ఏపీఓ దయాసాగర్ పరిశీలించారు. శ్రామికుల సమక్షంలో మస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు లేనివాళ్లు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కొలతలు ప్రకారమే వేతనాలు లభించనున్నట్లు చెప్పారు. వేతనాలకు తగ్గట్లుగా పనిచేయించాలని తెలిపారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి తిరిగి 10 గంటల్లోపు ఇళ్లకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



శ్రామికుల మస్టర్లను తనిఖీ చేస్తున్న ఏపీవో దయాసాగర్

సాగునీటి పారుదల కాలువ కబ్జా

● అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

కావలి రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొనదిన్నె సమీపంలో కావలి నుంచి తుమ్మలపెంట వెళ్లే రోడ్డుకు ఆనుకుని తాళ్లపాలెం చెరువు నుంచి నీరు పారుదల చేసే ప్రధాన కాలువ అయిన పడవకాలువ గట్టు తొలగించి కాలువ స్థలంలో గోడ నిర్మాణం చేపట్టారు. ఈ విషయంపై ఆముదాలదిన్నెకు చెందిన రైతు ఉప్పాల శ్రీనివాసులు శనివారం తహసీల్దార్ శ్రావణ్ కుమార్‌కు ఫిర్యాదుచేశాడు. స్థలాల ధరలకు రెక్కలు రావడంతో కాలువ ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లటంతో వీఆర్వోను పంపి పనులను నిలిపివేశారు. ఆముదాలదిన్నె నుంచి కొనదిన్నె, మోర్లవారిపాలెం, అల్లిగుంటపాలెం, కావలి పాతూరు రైతులకు చెందిన సుమారు 60 ఎకరాలకు పారుదలతో పాటు వర్షాకాలంలో కావలి నుంచి వచ్చే వరద నీరు మెత్తం ఈ కాలువ గుండా చిప్పలేరుకు చేరుతుందని ఆప్రాంత రైతులు వాపోతున్నారు. సాగు నీటి కాలువలు ఆక్రమణకు గురైతే పట్టణంలోని వరద నీరు మొత్తం పట్టణంలోని రోడ్లపైకే చేరుతున్నాయని, అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.



ఆముదాలదిన్నె సమీపంలో సాగునీటి పారుదల కాలువ గట్టు పూడ్చి చేపడుతున్న గోడ నిర్మాణ పనులు

టీడీపీ కోసం కష్టపడ్డ వారికే సంస్థాగత ఎన్నికల్లో పట్టం

● కావలి ఎమ్మెల్యే దగుమాటి

కావలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, పార్టీ సంస్థాగత ఎన్నికలలో తిరిగి పాతవారికే పదవులు ఇస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి టీడీపీ కార్యాలయంలో శనివారం పార్టీ ఎన్నికల పరిశీలకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, చక్కా మదన్‌కుమార్, పొన్నెబోయిన చెంచుకిషోర్‌ల సమక్షంలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో సంస్థాగత ఎన్నికల కమిటీల ఎంపిక కార్యక్రమం జరిగింది. నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తల సమక్షంలో పాత కమిటీలనే తిరిగి పునరుద్ధరిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ కోసం కష్టపడ్డ నేతలను గుర్తించి మరలా వారికే పదవులు ఇచ్చామని, అయితే గ్రూపులు లేకుండా కొత్త పాత నేతలందరినీ కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. త్వరలో రాబోయే మున్సిపల్, మండలపరిషత్, పంచాయతీ ఎన్నికలలో పోటీచేయాలనుకునేవారికి సర్వే చేసి ప్రజాభిమానం ఉన్న వారికే టిక్కెట్లు ఇవ్వటం జరుగుతుందన్నారు. పోటీ చేయాలనుకునే వారు ఇప్పటి నుంచే ప్రజలలోకి వెళ్లి ప్రజాభిమానం పొందాలన్నారు.



టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో ఎంపికైన వారితో ఎమ్మెల్యే దగుమాటి, పార్టీ పరిశీలకులు

సంస్థాగత ఎన్నికల కమిటీల అభ్యర్థులు వీరే

పార్టీ పరిశీలకుల సమక్షంలో కావలి నియోజకవర్గం లోని అన్ని మండలాల, పట్టణ కమిటీలను ఎమ్మెల్యే ప్రకటించారు. కావలి పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గుత్తికొండ క్రిషోర్‌బాబు, జ్యోతిబాబూరావులను, కావలి రూరల్‌కు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆవుల రామక్రిష్ణ, ఉప్పాల వెంకట్రావులను ఎంపికచేశారు. అల్లూరు పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రామిశెట్టి క్రిష్ణచైతన్య, అరగల రమణయ్యలను, అల్లూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బండి శ్రీనివాసులురెడ్డి, అంబటి రాజేంద్రలను ఎంపికచేశారు. బోగోలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మాలేపాటి నాగేశ్వరరావు, లేళ్లపల్లి సుధీరబాబు, దగదర్తి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా అల్లం హనుమంతరావు, వింజం కొండపనాయుడులను ఎంపికచేశారు. ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గంలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టకాలంలో జెండాపట్టిన ప్రతి కార్యకర్తకు న్యాయం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడ్డ వారికి పదవులు వస్తాయని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జెండా పట్టిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సంస్థాగత కమిటీల ఎన్నికల్లో భాగంగా కందుకూరు పట్టణం, లింగసముద్రం మండలాల పార్టీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. కందుకూరు పట్టణానికి ప్రస్తుత అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావును తిరిగి కొనసాగించేందుకు నిర్ణయించి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షుడిగా పూరిమిట్ల గురునాధంను ఎన్నుకున్నారు. ఈ పదవి కోసం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు పోటీపడగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచనతో గురునాధంను ప్రకటించారు. అలాగే కందుకూరు నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలిగా కల్లూరి శైలజను, కందుకూరు పట్టణ మహిళా అధ్యక్షురాలిగా ముచ్చు లక్ష్మీరాజ్యంను ఎంపిక చేసి ప్రకటించారు. కందుకూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు కుసుమ కుమారి, పార్టీ నాయకుడు సీహెచ్ కొండయ్య ఈ కార్యక్రమంలో పరిశీలకులుగా పాల్గొనగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నూతన అధ్యక్షుల ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షులుగా ఎన్నికైనవారు ఈసందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన దామా మల్లేశ్వరరావుకు మున్సిపాల్ మాజీ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, పట్టణంలోని వివిధ వార్డుల నాయకులు అభినందనలు తెలిపారు.



నూతన అధ్యక్షులుగా ఎన్నికైన నేతలతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

న్యూస్ బాక్స్

ఎస్ఐకి సన్మానం



ఎస్ఐ ప్రభాకర్‌ను సన్మానిస్తున్న సతీష్‌నాయుడు, వీరాల

బిట్రగుంట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల తిప్ప పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్సై ప్రభాకర్‌ను స్థానిక టీడీపీ, బీజేపీ, సామాజికకర్తలు శనివారం సన్మానించారు. కాంద్ర యువనేస్తం వ్యవస్థాపకులు సతీష్‌నాయుడు, నాగులవరంకు చెందిన సీనియర్ టీడీపీ నేత రామసుబ్బానాయుడు, బీజేపీ మండల అధ్యక్షులు వీరాల శ్రీనివాసులు యాదవ్ కలిసి సన్మానించారు. అలాగే టీడీపీ నేతలు మల్లికార్జున నాయుడు, వేణుగోపాల్ బాలక్రిష్ణ, బ్రహ్మయ్య తదితరులు ఎస్సైని కలిసి అభినందనలు తెలిపారు.

153 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 489 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 336 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-138, ఆర్‌ఆర్-3, సీఆర్-5, జంపింగ్‌లాట్స్-7 కారణాలతో 153 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.214.567గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

2న మండల సమావేశం

అల్లూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జూలై 2వ తేదీన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రజనీకాంత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో ప్రధాన అంశాలైన తాగునీరు, వైద్య ఆరోగ్యశాఖ, గ్రామీణ రోడ్లు, ఉపాధిహామీ, రెవెన్యూ సమస్యలు, విద్యాశాఖ, వ్యవసాయశాఖ, హౌసింగ్ శాఖ, ఇరిగేషన్ శాఖల ప్రగతిపై చర్చించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశానికి అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని కోరారు.

వంగవీటి మోహన రంగ విగ్రహావిష్కరణ పనుల పరిశీలన

కావలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ మాగుంట పార్వతమ్మ ట్రంకు రోడ్డులో వంగవీటి మోహనరంగ విగ్రహావిష్కరణ కార్యక్రమ పనులను శనివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి విగ్రహకమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. జూలై 2వ తేదీన భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణలు విగ్రహావిష్కరణలో పాల్గొననున్నందున పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు.

టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటికి సన్మానం



మాలేపాటిని సన్మానిస్తున్న బీజేపీ నేతలు

బిట్రగుంట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల టీడీపీ కన్వీనర్‌గా నాలోసారి మాలేపాటి నాగేశ్వరరావును ఎంపిక చేయడంతో మండల బీజేపీ నేతలు శనివారం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మండల అభివృద్ధి కార్యక్రమాలకు తోడుగా ఉంటామని బీజేపీ మండల అధ్యక్షులు వీరాల శ్రీనివాసులు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, గుర్రం వెంకటేశ్వర్లు, స్థానిక నేతలు గోవింద రాజులు, బాలసుబ్రహ్మణ్యం, పీ సూరిబాబు, తదితరులు ఉన్నారు.

దుర్గామాత ఆలయం కూల్చివేయడం దురదృష్టకరం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 28(ఆంధ్రజ్యోతి) : బంగ్లాదేశ్‌లో దుర్గామాత ఆలయం కూల్చివేత దురదృష్టకరమని బీజేపీ నాయకులు మిడతల రమేష్ ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. భారత్‌లో బంగ్లాదేశీయులు స్వేచ్ఛగా బతుకుతుంటే బంగ్లాదేశ్‌లో హిందువులు భయభ్రాంతులతో బతుకుతున్నారని తెలిపారు. సెక్యులరిస్టు మేధావులు హిందువుల రక్షణకు నోరువిప్పాలని డిమాండ్ చేశారు. అర్థ శతాబ్ధం కాలంగా పూజలు జరుపుకుంటున్న దుర్గామాత ఆలయాన్ని తీవ్రవాదుల బెదిరింపులతో బంగ్లా సర్కార్ కూల్చివేయడం శోచనీయమన్నారు.

మంచినీటి ట్యాంకు క్లోరినేషన్



మంచినీటి ట్యాంకును శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

లింగసముద్రం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాల పంచాయతీలోని రాళ్లపాడు గ్రామంలోని మంచినీటి ట్యాంకును అధికారులు క్లోరినేషన్ చేయించారు. శనివారం పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావు పంచాయతీ సిబ్బందితో మంచినీటి ట్యాంకును శుభ్రం చేయించారు. దీంతో గ్రామస్థులకు పరిశుభ్రమైన నీరు సరఫరా అవుతోంది.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

కావలి రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం తుమ్మలపెంటలోని ఏపి బాలికల గురుకుల పాఠశాలలో 8మంది ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు స్వీకరించటం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె పద్మావతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఉపాధ్యాయ పోస్టులకు పోస్టు గ్రాడ్యుయేట్ తెలుగు, హింది, ట్రైన్డు గ్రాడ్యుయేట్ తెలుగు, హిందితో పాటు ఇంగ్లీష్ మీడియంలో బోధించుటకు పోస్టు గ్రాడ్యుయేట్ గణితము, ఫిజికల్ సైన్స్, నేచురల్ సైన్స్ ట్రైన్డు గ్రాడ్యుయేట్ ఫిజికల్ సైన్స్ మొత్తం 8 పోస్టులకు దరఖాస్తు స్వీకరించటం జరుగుతుందన్నారు. పోస్టు గ్రాడ్యుయేట్ పోస్టులకు ఎంఎస్సీ బీఈడి, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ పోస్టులకు బిఎస్సీ బీఈడి, లాంగ్వేజ్ పోస్టులకు డిగ్రీ, పండిట్ ట్రైనింగ్ అవసరం. అలాగే అభ్యర్థులు టెట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు జూలై 6వ తేదీ లోపు పూర్తి వివరాలతో దరఖాస్తును ప్రధానోపాధ్యాయురాలికి అందజేయాలని, డిప్యూటీ డీఈవో హరిప్రసాద్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు డెమో తరగతులు నిర్వహించి ఎంపిక చెయ్యటం జరుగుతుందన్నారు.

భక్తులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

వలేటివారిపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): భక్తులకు నాణ్యమైన భోజనం పెట్టాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆలయ అధికారులకు సూచించారు. మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామిని శనివారం ఎమ్మెల్యే నాగేశ్వరరావు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేసి, ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నదానం, తాగునీరు, క్యూలైన్‌లు, విశ్రాంతి షెడ్లు, పార్కింగ్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అన్నదాన సత్రంలో భోజనం చేస్తున్న భక్తులతో స్వయంగా మాటాడారు. భోజనం నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. భోజనంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్, మండల టీడీపీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, క్లస్టర్ ఇన్‌చార్జి కాకుమాను హర్షకుమార్, చుండి అక్కయ్య, మహంకాళీ మల్లిఖార్జునరావు, కందుకూరు రూరల్, వలేటివారిపాలెం ఎస్ఐలు బాల మహేంద్ర నాయక్, మరిదినాయుడు పాల్గొన్నారు.

కొలతల ప్రకారమే ఉపాధి పనులు చేయాలి



శ్రామికుల మస్టర్లను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

లింగసముద్రం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో శ్రామికులు కొలతల ప్రకారం పనులు చేయాలని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు సూచించారు. శనివారం ఉదయం మండలంలోని పెదపవని గ్రామంలోని చెరువులో, కాలు వల పూడికతీత పనులను ఎంపీ డీఓ శ్రీనివాసులు, ఏపీఓ షేక్ సమీర్‌బాషా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు శ్రామికుల మస్టర్లను పరిశీలించారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు పనులకు వచ్చి 10 గంటల వరకు చేసి ప్రభుత్వం నిర్దేశించిన కూలీ డబ్బులు పొందాలని ఎంపీడీఓ శ్రీనివాసులు చెప్పారు. అలాగే ఒకరి బదులు మరొకరు పనులకు రాకూడదన్నారు. బోగస్ మస్టర్లు వేస్తే ఎఫ్‌ఏలపై, మేట్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఏ ధనుం మధు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్ పగిలి ఆర్‌అండ్‌బీ రోడ్డు ధ్వంసం

లింగసముద్రం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): లింగసముద్రం పంచాయతీలోని వాకమళ్లవారిపాలెం ఆనకట్ట వద్ద మంచినీటి పైపులైన్ పగిలినా అధికారులు, సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో ఆర్‌అండ్‌బీ రోడ్డు ధ్వంసమైందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 20 రోజుల క్రితం ఈ రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు గుత్తేదారు సిబ్బందితో ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తీస్తున్నారు. దీంతో ఎక్స్‌కవేటర్ తగిలి మంచినీటి పైపులైన్ పగిలి పోయింది. అయితే ఈ పైపులైన్ లీకేజీని అరికట్టేందుకు అటు విద్యుత్ గుత్తేదారు సిబ్బంది కానీ పంచాయతీ అధికారులు గానీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గానీ మరమ్మతు పనులు చేపట్టలేదు. దీంతో ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై రోడ్డుకు అడ్డంగా కాలువలాగా ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వాకమళ్లవారిపాలెం ఆనకట్ట వద్ద పైపులైన్ లీకేజీ నీటితో ధ్వంసమైన ఆర్‌అండ్‌బీ రోడ్డు

ప్రజలకు సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి



చుండి గ్రామ సచివాలయంలో రిజిస్టర్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేంద్రదేవ్

వలేటివారిపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సేవలను అందించాలని ఎంపీడీఓ నరేంద్రదేవ్ సూచించారు. మండలంలోని చుండి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ శనివారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టరు, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నరేంద్రదేవ్ మాట్లాడుతూ గ్రామస్థులకు ఐవిఆర్ఎస్ కాల్స్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ సర్వేల పురోగతిని పరిశీలించారు. దివ్యాంగులకు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలని సూచించారు.

ఎట్టకేలకు చేతిపంపునకు మరమ్మతులు



ఫిర్యాదుపై స్పందన ఉత్తరవు అందుకుంటున్న కార్యదర్శి

బిట్రగుంట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు శ్మశాన వాటికలోని చేతిపంపునకు మరమ్మతులు చేశారని స్థానిక ప్రజలు శనివారం హర్షం వ్యక్తం చేశారు. బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం శ్మశాన వాటికలోని చేతిపంపు కొన్ని నెలలుగా మరమ్మతులకు గురై స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈవిషయమై జైభీం అంబేడ్కర్ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర అధికారుల దృష్టికి తీసుకుపోవడం, పలు పత్రికల్లో ప్రచురించినా అధికారులు స్పందించక పోవడంతో ఆయన జిల్లా గ్రీవెన్స్‌లో ఈనెల 24వ తేదీన ఫిర్యాదు చేశారు. దీంతో అధికారుల ఆదేశాల మేరకు మరమ్మతులు పూర్తిచేశారు.

నిరుపయోగంగా గోదాము



నిరుపయోగంగా ఉన్న గోదాము

వలేటివారిపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ. 15 లక్షలతో నిర్మించిన గోదాము (కలెక్షన్ సెంటర్) వినియోగంలో లేక నిరుపయోగంగా మారింది. గోదాము నిర్మించారే తప్ప వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో అది నేటికీ నిరుపయోగంగానే ఉంది. రైతులు పండించిన పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు లక్షల ప్రజాధనాన్ని ఖర్చుచేసి 200 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాం నిర్మించారు. ఇప్పటికైనా సంబంధిత అధకారులు స్పందించి గోదామును వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ప్రమాదాలకు నిలయంగా చెన్నాయిపాలెం రోడ్డు

● దెబ్బతిన్న రోడ్డుతో తరచూ ప్రమాదాలు

కావలి రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం చెన్నాయిపాలెం రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంటలు మిట్టలుగా మారి ప్రమాదాలకు నిలయంగా ఉందని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. శ్రీరామపురం, నందిమపురం, పెదపట్టపుపాలెం తదితర తీరప్రాంత గ్రామాల నుండి మత్స్యసంపద ను వాహనాలల్లో కావలి తరలిస్తుంటారు. అలాగే ఎక్కువగా ఆ ప్రాంతాలల్లో వేరుశెనగ పడిస్తు తరలిస్తుంటారు. దీంతో ఆ మార్గం వాహనాల రాకపోకల తో నిత్యం రద్దీగా ఉంటుంది. సింగల్ రోడ్డు కావటానికి తోడు రోడ్డు మొత్తం దెబ్బతిని గుంటలు మిట్టలుగా మారడం తో తరచూ ఆ మార్గం లో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డ నిర్మాణం చేపట్టి ప్రమాదాలను అరికట్టాలని అప్పటి వరకు రోడ్డు దెబ్బతిన్న చోట ప్యాచ్‌వర్కు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



గుంతలమయమైన చెన్నాయిపాలెం రోడ్డు

రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు వసతులు కల్పించాలి



రొట్టెల పండుగ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జనసేన నాయకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతిక అయిన బారాషహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కూటమి నాయకులు వసతులు కల్పించాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కోరారు. రొట్టెల పండుగ సందర్భంగా బారాషహీద్ దర్గా వద్ద ఏర్పాట్లను జనసేన పార్టీ నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆధ్వర్యంలో జరగనున్న రొట్టెల పండుగ మహోత్సవానికి భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా అధికారులు నిత్యం పర్యవేక్షించాలన్నారు. కమిటీ సభ్యులుగా జనసేన నాయకులకు అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందరరామిరెడ్డి, దర్గా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆజాద్ జమీర్, కమిటీ సభ్యులు యస్దాని, సుల్తాన్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట ఎమ్మెల్యే

ఏడాదిలో ఏం చేశారు?



తండ్రి రాజకీయ నేత అయినా.. ఆమె ఎంబీబీఎస్ చదివి వైద్యవృత్తిని చేపట్టారు. అనూహ్యంగా 2024లో రాజకీయ ప్రవేశం చేశారు. అనుభవం లేదు. పేట రాజకీయాలను ఈ డాక్టర్ ఎలా ఎదుర్కొని నిలదొక్కుకుంటారని అంతా పెదవి విరిచారు. అయితే తొలి అడుగులోనే ఆమె విజయ పతాకం ఎగరేశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా పదవీ బాధ్యతలు తీసుకున్నాక నెలవల విజయశ్రీ అలుపెరుగని ప్రయాణం సాగిస్తున్నారు. తిరుపతి ఎంపీగానూ, సూళ్లూరుపేట ఎమ్మెల్యేగానూ చేసిన తండ్రి నెలవల సుబ్రమణ్యం అనుభవాన్ని ఆసరా చేసుకుంటున్నారు. పల్లెపల్లే, గడపగడపా తిరుగుతూ సొంత బాటను ఏర్పరచుకుంటున్నారు. 'గుడ్ మార్నింగ్..' అంటూ సొంతంగా ఒక కార్యక్రమాన్ని రూపొందించుకుని తెల్లవారకముందే పల్లెబాట పడుతున్నారు. ప్రజల్లో నిరంతరం ఉంటూ సమస్యలు తెలుసుకుంటున్నారు. ఇందుకోసం తన నివాసాన్ని సూళ్లూరుపేటకు మార్చుకున్నారు. ప్రజలకు ఏం చేయాలో ప్రజల నుంచే నేర్చుకుంటూ నెలవల విజయశ్రీ తొలి ఏడాది ప్రయాణం సాగింది. ఈ ఏడాదిలో ఆమె సూళ్లూరుపేట నియోజకవర్గానికి ఏం చేశారు? ఏం చేస్తామని ఎన్నికల్లో చెప్పారు? ఇంకా ఆమె ముందున్న సవాళ్లు ఏమిటి? సూళ్లూరుపేట ప్రజలు తమ ఎమ్మెల్యే నుంచి ఏం ఆశిస్తున్నారు...? వీటి సమాహారమే ఇది...

- 6వ పేజీలో -

ఈనెలా కందిపప్పు లేనట్లే!

రేషన్ కార్డుదారులకు తప్పని నిరాశ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 28(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు కందిపప్పు దూరమవుతోంది. అవసరమైన మేరకు సరఫరా లేకపోవడంతో ఈ ఏడాది మార్చి నుంచి కందిపప్పు సరఫరా నిలిపేశారు. జూలై నెలలోనూ బియ్యం, చక్కెరతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా, జూలైలో బియ్యం, చక్కెరతో పాటు కందిపప్పు, రాగులు, ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఆచరణకు నోచుకోవడం లేదు. దీనిపై పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజును వివరణ కోరగా అవసరమైన మేరకు సరుకు లేకపోవడంతో ఇవ్వలేకపోతున్నామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల పౌరసరఫరాల వ్యవస్థ చిన్నాభిన్నమైంది. దాన్ని సరిచేయడం ప్రస్తుత పాలకులకు సవాలుగా మారింది.

101 ఒప్పందాలు

- కొనుగోలు, అమ్మకందారుల సమావేశాలు విజయవంతం



ఎంఓయూలు చేసుకుంటున్న కొనుగోలు, అమ్మకందారులు

తిరుచానూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన కొనుగోలు, అమ్మకందారుల సమావేశాలు విజయవంతమయ్యాయని ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుదర్శన్‌బాబు, ఎఫ్ఐఈఓ జాయింట్ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ తెలిపారు. మొత్తం 101 ఎంఓయూలు కుదిరినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎంఎస్ఎంఈడీసీ), భారత ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈఓ) ఆధ్వర్యంలో తాజ్‌హోటల్ వేదికగా మూడు రోజులపాటు జరిగిన కొనుగోలు, అమ్మకందారుల సమావేశాలు శనివారంతో ముగిశాయి. వారు మాట్లాడుతూ 40 మంది ఎగుమతిదారులు, 38 మంది మహిళా వ్యవస్థాపకులతో 101 ఎంఓయూలు కుదిరినట్టు వివరించారు. ఈ అవగాహనా ఒప్పందాలు ఎంఎస్ఎంఈలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓ), చేతివృత్తులవారు, నేత సంఘాలకు అంతర్జాతీయ వాణిజ్య అవకాశాలను మరింతంగా పెంపొందిస్తుందని వివరించారు.



డంపింగ్ యార్డులోని లెగసీ వ్యర్థాలు - గుట్టలుగా కనిపిస్తున్న తడి వ్యర్థాలు

తొలగని చెత్త తలనొప్పి

- డంపింగ్ యార్డులో పెరుగుతున్న వ్యర్థాలు
- కాలపరిమితి ముగియడంతో వెనుదిరిగిన కాంట్రాక్టర్లు
- ఫలించని టీటీడీ 'ఉచిత' నిర్వహణయత్నం

తిరుమల, జూన్28(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై చెత్త సమస్య సమసిపోలేదు. మళ్లీ వ్యర్థాలు గుట్టల్లా పోగవుతున్నాయి. కొండలా పేరుకుపోతున్న ఇక్కడి చెత్త తొలగింపుపై గతేడాది టీడీపీ ప్రత్యేక దృష్టి సారించింది. కొండ మీద రోజూ తడిచెత్త దాదాపు 30 టన్నులు, పొడిచెత్త 40 టన్నుల వరకు సేకరించి గోగర్భం డ్యాం సమీపంలోని కాకులమాను దిబ్బ వద్ద డంప్‌యార్డ్‌కు తరలిస్తున్నారు. అక్కడ తడిచెత్తను ప్రాసెస్ చేశాక కంపోస్టు తయారు చేసి మిగిలిన వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీ లేదా పవర్‌ప్రాజెక్ట్‌ల ప్రాంతాలకు పంపాలి. కానీ ఐదారేళ్లుగా ఈ ప్రక్రియ సరైన రీతిలో జరగలేదు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి తడి, పొడిచెత్తలను వేరు చేసి తరలించడంలోనే విఫలమాయ్యారు. దీంతో కంపోస్టు కేంద్రంలో నిర్వహణ సరిగా జరగలేదు. ఫలితంగా కొండలను తలపించేలా వ్యర్థాలు చేరిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక గతేడాది నవంబరులో ఈ సమస్య పరిష్కరించాలని సంకల్పించింది. అప్పటికే దాదాపు నాలుగున్నర లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలున్నట్టు గుర్తించారు. ఆరు నెలల్లోపు క్లియర్ చేస్తామని ప్రకటించారు.

వెనుదిరిగిన కాంట్రాక్టు సంస్థలు

కొన్ని నెలల పాటు ఓ సంస్థ దాదాపు 1.80 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వ్యర్థాలను ప్రాసెస్ చేసి తొలగించింది. సవ్యంగా జరుగుతోందనుకునే లోపే సంస్థ కాంట్రాక్టు పూర్తయింది. కాంట్రాక్టును పొడిగించాలని ఆ సంస్థ కోరింది. టీటీడీ అంగీకరించలేదు. ఉచితంగా చేయాలని కోరింది. దీంతో ఆ సంస్థ వెళ్లిపోయినట్టు సమాచారం. తడిచెత్తను ప్రాసెస్ చేసే సంస్థ కాంట్రాక్టు కూడా ఈ ఏడాది మార్చికే పూర్తయింది. యంత్రాల మరమ్మతులు, కార్మిక సమస్యతో సరిగా నిర్వహించలేదంటూ ఆ సంస్థకు కూడా అనుమతికి నిరాకరించింది. పొడి వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన మరో సంస్థకు ఎనిమిదేళ్ల పాటు అగ్రిమెంట్ ఉంది. ఈ సంస్థ కూడా సమర్థమంతంగా నిర్వహించడం లేదని టీటీడీ భావించింది. యంత్రాలతో చేయాలనే నిబంధన లేకపోవడంతో మాన్యువల్‌గానే ప్రాసెస్ చేస్తున్న క్రమంలో పొడిచెత్త ఎంతకూ తరగడం లేదు. దీంతో డంపింగ్ యార్డులో లెగసీ వ్యర్థాలు 50 వేల మెట్రిక్ టన్నులు, తడి వ్యర్థాలు 31,500 మెట్రిక్ టన్నులు, పొడి వ్యర్థాలు 4,800 మెట్రిక్ టన్నులు పేరుకుపోయాయి. తిరుమల పర్యావరణానికే ఈ వ్యర్థాల ద్వారా నష్టం వాటిల్లే అవకాశముందనే భయంతో టీటీడీ ఇటీవల రాజే ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ సంస్థను సలహాదారుగా నియమించింది. ఈ సంస్థ పలు సూచనలు చేసింది. వీలైనంత త్వరగా ఓపెన్ టెండర్లను పిలిచి తొలగించాలని, లేకుంటే ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయని పేర్కొంది. ఉచితం కోసం ఎదురు చూడాలా, సమర్థ సంస్థలకు టెండర్లు ఖరారు చేయాలా అని టీటీడీ తర్జనభర్జనలు పడుతున్నట్లు తెలిసింది.

పరిమితి మించితే చర్యలు

స్కూలు బస్సులు, ఆటోలకు ఎస్పీ హెచ్చరిక

తిరుపతి(నేరవిభాగం), జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల బస్సులు, ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళితే చర్యలు తప్పవని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హెచ్చరించారు. వాహనాలకు సంబంధించి అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలని తెలిపారు. డ్రైవర్లకు లైసెన్స్ లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వేగం నియంత్రణలో ఉండాలని తెలిపారు. ప్రతిరోజూ డ్రైవర్లు బస్సులు తీసుకునే సమయంలో యాజమాన్యం అన్నీ పరిశీలించి అనుమతించాలని కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏర్పేడు హౌసింగ్‌లో స్టీల్ గోల్‌మాల్

- రూ.34 లక్షల విలువైన 44 టన్నులు మాయం

ఏర్పేడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో భారీ కుంభకోణం వెలుగుచూసింది. 34 లక్షల రూపాయల విలువైన స్టీల్‌ను వైసీపీ హయాంలో అధికారులు స్వాహా చేశారు. ఇందులో ఎవరి పాత్ర ఏమిటో విచారణలో నిగ్గు తేల్చాల్సి ఉంది. గత వైసీపీ పాలనలో అవుట్ సోర్సింగ్ కింద హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న అమర్నాథ్‌ను మండల హౌసింగ్ ఏఈగా నియమించారు. ఆయన 2023 ఫిబ్రవరి నుంచి 2025 మార్చి 14వ తేదీ వరకు మండలంలో పనిచేశారు. చివర సంవత్సరంలో వంద టన్నుల స్టీల్ కావాలని జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఆ మేరకు గోడౌన్ నుంచి స్టీలు మండలానికి తెప్పించుకున్నాడు. అందులో 56 టన్నులను మాత్రమే హౌసింగ్ లబ్ధిదారులకు పంపిణీ చేశాడు. మిగిలిన 44 టన్నులను స్వాహా చేశారు. దాని విలువ 34 లక్షల రూపాయలుగా ఉంది. ఇది అప్పటి ప్రజాప్రతినిధుల అండదండలతో వారి కనుసన్నల్లోనే జరిగినట్లు తెలుస్తోంది.

వెలుగులోకి వచ్చిందిలా..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైసీపీ పాలనలో జరిగిన ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. 44 టన్నుల స్టీలు గోల్‌మాల్ జరిగినట్లు తేలింది. కాగా, ఏ అధికారులైతే అవినీతి జరిగినట్లు గుర్తించారో వారే దాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి దీనికి వెనుక ఎవరున్నారనేది నిగ్గు తేల్చాల్సి ఉంది. కాగా, మండల స్థాయి నాయకులు హౌసింగ్ అధికారులను ప్రలోభాలకు గురిచేసి స్టీల్‌ను తమ ఇళ్లకు తరలించుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై విచారణ చేపట్టిన హౌసింగ్ డీఈ త్వరలో పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశముంది.

ముగిసిన వార్డు కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్

చిత్తూరు అర్బన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. శనివారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియను కమిషనర్ నరసింహప్రసాద్ పర్యవేక్షించారు. చిత్తూరు, తిరుపతి నగరపాలక సంస్థలు, మదనపల్లె, కుప్పం, పుంగనూరు, పలమనేరు, పుత్తూరు, నగరి, శ్రీకాళహస్తి పురపాలక సంఘాల పరిధిలో ఐదేళ్ల పూర్తి చేసుకుని వారికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్, ఎడ్యుకేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహించి, వారినుంచి ఆప్షన్ ఫామ్స్ తీసుకున్నారు. రెండో రోజు జరిగిన కౌన్సెలింగ్‌కు వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్యదర్శులు 184 మంది, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు 192 మంది, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు 143 మంది, రిక్వెస్టు బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్న 38 మంది హాజరయ్యారు.





బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు, హాజరైన సచివాలయ ఉద్యోగులు

దోబూచులాడుతున్న రుతుపవనాలు

పుత్తూరు టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఇదిగో రుతుపవనాలు.. అదిగో వర్షాలంటూ వాతావరణ శాఖాధికారుల ప్రకటనలను నమ్మిన రైతన్నలకు నిరాశే మిగులుతోంది. సాధారణంగా ఖరీఫ్ సీజన్ జూన్ మొదటి నెలలోనే ప్రారంభం అవుతుంది. రైతులు మే నెలలో కురిసిన తొలకరి వర్షాలతో సాగుకు సిద్ధం చేసుకున్నారు. ఈ ఏడాది జూన్ పూర్తవుతున్నప్పటికీ వర్షాలు కురవకపోవడంతో రైతన్నలు నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాధారణంగా తూర్పు మండలాల్లో సాధారణం కంటే తక్కువే కురిసింది. దీనికితోడు వాతావరణ శాఖాధికారులు చేసిన ప్రకటనలతో రైతన్నలు సంతోషపడినప్పటికీ రుతుపవనాలు కానరాకపోవడంతో దుక్కులు దున్ని ఆకాశం వైపు వర్షం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ సీజన్‌లో సాధారణంగా వరి, వేరుశనగ, సజ్జలు అధిక మొత్తంలో పండిస్తారు. బోర్లు, బావులు ఉన్నప్పటికీ ఖరీఫ్ సాగుకు కావాల్సినంత నీరు వర్షం ద్వారానే సాధ్యమవుతుంది. ఆ మేరకు వర్షాలు పడకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

■ శ్రీవారి సేవలో ప్రముఖులు

హెచ్‌కే పాటిల్ - సమీర్

తిరుమల, జూన్28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం కర్ణాటక మంత్రి హెచ్‌కే పాటిల్, సినీనటుడు సమీర్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

కన్నుల పండువగా జగన్నాథ రథయాత్ర

సూళ్లూరుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో శనివారం సాయంత్రం జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా సాగింది. వీక్షించిన భక్తజనులు పరవశించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో రథయాత్ర భక్తుల కోలాహలం.. హరేరామ సంకీర్తనల నడుమ.. చిన్నారుల వేషధారణలు, కోలాటం.. భక్తుల భజనలతో షార్ బస్టాండు నుంచి ప్రారంభమైన 4 కిలో మీటర్ల దూరం సాగింది. షార్ బస్టాండు వద్ద వందలాది మంది భక్తుల జయజయ ధ్వానాలు, మంగళవాయిద్యాల మధ్య ఇస్కాన్ టెంపుల్ వారు పూజలు జరిపి రథోత్సవాన్ని ప్రారంభించారు. ప్రారంభమైన వెంటనే కారుమబ్బులు కమ్ముకుని ఒక నిమిషం పాటు ఆ ప్రాంతంలో తేలికపాటి జల్లుతో కూడిన వర్షం పడింది. ఇదంతా స్వామి మహిళ అని అక్కడి భక్తులు చర్చించుకోవడం కనిపించింది. ఫ్లైవోవర్ బ్రిడ్జి, జీఎన్‌టీ రోడ్డు మీదుగా రథాన్ని ఊరేగించారు. వేలాది మంది భక్తులు రథాన్ని లాగుతూ భక్తిని చాటారు. చెంగాళమ్మ ఆలయం సమీపంలోని శ్రీనగర్ కాలనీ వద్ద యాత్రను ముగించారు. ఈ సందర్భంగా భక్తుల నృత్యాలు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



శ్రీవారి దర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.02 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,229

తలనీలాలు సమర్పించినవారు: 30,559

కథనం, ఇంటర్వ్యూ
తడ, సూళ్లూరుపేట (ఆంధ్రజ్యోతి)

తమిళనాడు సరిహద్దు నియోజకవర్గం సూళ్లూరుపేట. అంతర్జాతీయ ప్రఖ్యాతిగాంచిన శ్రీహరికోట రాకెట్ కేంద్రం, జాతీయ పారిశ్రామిక విజయపతాకం శ్రీసిటీ, ప్రకృతి ప్రసాదించిన వరం పులికాట్ సరస్సు ఈ నియోజకవర్గం కీర్తి కిరీటాలు. ఈ రిజర్వుడు నియోజకవర్గంలో రాజకీయంగా నిలదొక్కుకోవడం ప్రతి నిత్యమూ ఒక సవాలే. స్టెతస్కోప్ చేతబట్టుకుని అమాయకంగా రాజకీయ ప్రవేశం చేసిన నెలవల విజయశ్రీ తొలి ఏడాదిలోనే గట్టి ఎమ్మెల్యే అనే పేరు తెచ్చుకున్నారు. జనంలో తిరుగుతూ, సమస్యలు తెలుసుకుంటూ, అసెంబ్లీలో ప్రస్తావిస్తూ, అధినేతకు విన్నవించుకుంటూ ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఈ ఏడాది కాలంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా ఆమె సాధించినవీ, జనం ఆశిస్తున్నవీ, నెరవేర్చాల్సిన హామీల సమాహార సమీక్ష...

పులికాట్ ఫైలు కదిలింది!



- రూ.98కోట్లతో పనులు మొదలవుతున్నాయి
- ఈ ఏడాదిలోనే చెక్‌డ్యాంల పనులు చేపడతాం
- సీఎంను నిధులు అడిగా
- అటవీ అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నా
- కాళంగి గ్రాయిన్ ఫైలు కదిలింది

ఏడాదిలో ఏం చేశారు?

సూళ్లూరుపేట ఎమ్మెల్యే

డాక్టర్ నెలవల విజయశ్రీ

? ఈ ఏడాదిలో ఎమ్మెల్యేగా మీరు సూళ్లూరుపేట నియోజకవర్గానికి చేసిన పనులేమిటి

! సుమారు రూ.150 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టాం. నిరంతరం ప్రజల్లో తిరుగుతూ ఉన్నపుడు కష్టాల్లో ఉన్న అనేకమంది తారసపడ్డారు. వీరికి సీఎం సహాయ నిధి నుంచి రూ.3 కోట్లు మంజూరు చేయించా.

● నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీల్లో రూ.8.42 కోట్లతో పనులు చేపట్టాం. సూళ్లూరుపేట మున్సిపాలిటీలో రూ.5.62 కోట్లతో 29 పనులు చేయించాం. నాయుడుపేట మున్సిపాలిటీలో రూ.2.80 కోట్లతో 34 పనులు చేపట్టాం.



? పులికాట్‌లో పూడికతీత అన్నది మా కలగానే మిగిలిపోయింది.ప్రభుత్వాలు మారుతున్నాయిగానీ పని జరగడం లేదు. ఎమ్మెల్యేగారూ.. మీరు కూడా గత నాయకుల లాగే ఎన్నికల సమయంలో పూడిక తీయిస్తామని హామీ ఇచ్చారు. నెరవేరుస్తారనే ఆశతో ఉన్నాం.

- జయచంద్రన్, మత్స్యకారుడు, బీవీ పాలెం, తడ మండలం

! నేనిచ్చిన హామీని మరచిపోలేదు. పులికాట్ పూడికతీత గురించి సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం రూ.98 కోట్లు నిధులిచ్చింది. ఏపీ మారిటైమ్ బోర్డు ద్వారా టెండర్లు కూడా పిలిచారు. జూలైలో టెండర్లు ఖరారవుతాయి. వెంటనే పనులు మొదలవుతాయి.

-ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



? చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మారిస్తే చెరువు కింద 14గ్రామాల ఆయకట్టు భూములకు సాగునీరు అందుతుందని మేమంతా ఎన్నికల సమయంలో మిమ్మల్ని కోరాం. మీరు కూడా సానుకూలంగా స్పందించారు. మాట నిలబెట్టుకోండి ఎమ్మెల్యేగారూ.

- చెంబేటి రామయ్య, రైతు, చెంబేడు, పెళ్లకూరు మండలం

! ఇచ్చిన మాట నెరవేర్చి తీరుతాను. రూ.16 కోట్ల అంచనా వ్యయంతో చెంబేడు మినీ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. సీఎంవోకు పంపించాం.నిధుల కోసం సీఎం చంద్రబాబును అభ్యర్థించాం.ఈ ఏడాదిలో పనులు మొదలు పెట్టించేందుకు ప్రయత్నిస్తున్నా.

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



? ఎమ్మెల్యేగారూ మీజూరు వద్ద చెక్‌డ్యాంలు కట్టిస్తామని ఎన్నికలకు ముందు మీరు హామీ ఇచ్చారు.చెక్‌డ్యాంలు కట్టిస్తే వాన నీరంతా పులికాట్‌లో కలిసిపోకుండా ఆగుతుంది.మీజూరు, వేలికాడు, నాగినేరి, కారికాడు, బేరుజంగాలపల్లి గ్రామాలకు చెందిన 7 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

-వి. వెంకటేశ్వర్లు, మీజూరు, దొరవారిసత్రం మండలం

! 2018లో టీడీపీ ప్రభుత్వం ఇక్కడ నాలుగు చెక్‌డ్యామ్‌ల నిర్మాణం మొదలుపెట్టింది. కేంద్ర అటవీ శాఖ అభ్యంతరాలతో పునాదుల దశలోనే పనులు ఆగిపోయాయి. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇపుడు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబును కోరాం.అటవీ శాఖ అనుమతులు కూడా తెప్పించి ఈ ఏడాదిలో పనులు చేపడతాం.

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



? పులికాట్‌లో ఉండే ఊరు మాది. కొరిడి-పేర్నాడు బాట బాగుంటేనే బయటి ప్రపంచంతో మాకు సంబంధాలుంటాయి. ఈ మట్టి రోడ్డులో ప్రయాణం అంటే నడుములు విరిగిపోతాయి. వాన కురిస్తే కాలు కూడా కదపలేం.గెలిస్తే తారు రోడ్డు వేయిస్తానని మీరు హామీ ఇచ్చారు. గెలిచారు. ఏడాది అయ్యింది. మమ్మల్ని పులికాట్‌కి వదిలేయద్దమ్మా అని వేడుకుంటున్నాం.

- ఆకాశ పాలెయ్య, రాగన్న పట్టెడ, సూళ్లూరుపేట మండలం

! ఈ రోడ్డును నేను వదిలేయలేదు. పర్యావరణ పరంగా ఇది సున్నితమైన ప్రాంతం. 23 కిలోమీటర్ల కొరిడి-పేర్నాడు తారు రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతించడం లేదు. ఈ ప్రాంత ప్రజల కష్టాల గురించి అసెంబ్లీలో ప్రస్తావించాను.సీఎం, డిప్యూటీ సీఎంలను కలసి విన్నవించా. జూలైలో డిప్యూటీ సీఎంను మరోసారి కలసి అటవీ అనుమతులు తెప్పించేందుకు కృషి చేస్తా.ఈ ఏడాదిలోనే పనులు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నా.

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



ఐదేళ్ళ విరామం తర్వాత ఫ్లెమింగో ఫెస్టివల్ తిరిగి ప్రారంభించిన దృశ్యాలు

సూళ్లూరుపేట నియోజకవర్గానికి ప్రపంచ పర్యావరణ, పర్యాటక రంగంలో గుర్తింపు తెచ్చిన ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పునరుద్ధరించే విషయంలో ఎమ్మెల్యే విజయశ్రీ కీలక పాత్ర పోషించారు. 2020 జనవరిలో చివరిసారిగా ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించగా తర్వాత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వం వచ్చాకే ఈ ఏడాది జనవరిలో ఈ బర్డ్ ఫెస్టివల్‌ను తిరిగి ప్రారంభించింది. దీనికోసం విజయశ్రీ సీఎం చంద్రబాబును కలసి గట్టి ప్రయత్నం చేసి, ఘనంగా నిర్వహించారు.

కొరిడి-పేర్నాడు రోడ్డు దుస్థితి





గత వైసీపీ ప్రభుత్వంలో నాయుడుపేట పట్టణంలో విన్నమాల మెయిన్ రోడ్డు దుస్థితి



విన్నమాల మెయిన్ రోడ్డు ప్రస్తుత స్థితి

● నియోజకవర్గంలో అయిదేళ్లుగా అతీగతీ లేకుండా దారుణ స్థితిలో అనేక రోడ్లు కనిపించాయి. రూ.13.70 కోట్లతో 22 పనులు చేపట్టి 83.27 కి.మీ.ల ఆర్ అండ్ బీ రోడ్లు బాగు చేయించాం. పీఆర్ శాఖలో రూ.20.26 కోట్లతో 269 పనులు చేపట్టి 41.5 కి.మీ. సీసీ రోడ్లు వేయించాం. రూ.27.56 కోట్లతో తారు రోడ్లు వేయించాం. ఓజిలి కరబల్లవోలు రోడ్డు నుంచి అయ్యవారిపాలెం వరకూ రూ.8.38 కోట్లతో రోడ్డు వేయించాం. నాయుడుపేట ఎన్‌హెచ్ 16 నుంచి కమ్మవారిపాలేనికి రూ. 4.30 కోట్లతో బీటీ రోడ్డు వేస్తున్నాం. నాయుడుపేట నుంచి చిగురుపాడు అగ్రహారానికి రూ.1.95 కోట్లతో బీటీ రోడ్డు వేస్తున్నాం. తడ ఎంసీ రోడ్డు నుంచి బీవీ పాలేనికి రూ.63 లక్షలతో బీటీ రోడ్డు వేస్తున్నాం. రూ. 12.30 కోట్లతో పెళ్లకూరు మండలంలో కాళంగిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. ఇంకా రూ.1.05 కోట్లతో నాలుగు అంగన్‌వాడీ భవనాలు నిర్మించాం.ఐసీడీఎస్ ఆఫీసు భవనానికి మరమ్మతులు చేయించాం.పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో మొత్తం రూ.47.82 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

● తాగునీటికి ప్రాధాన్యం ఇచ్చా. ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా రూ.12.19 కోట్లతో 176 పనులు పూర్తి చేయించాం. రూ.65.24 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేశాం. తెలుగు గంగ కాలువల అభివృద్ధికి రూ.64.69 లక్షలతో 12 పనులు చేయించాం. రూ.4.31 కోట్లతో 187 గోకులం షెడ్లు నిర్మించాం. రూ.41.12 లక్షలతో బీసీ హాస్టళ్లను అభివృద్ధి పరిచాం.

● రూ.57.64 కోట్ల ఉపాధి హామీ నిధులతో 126 పనులు పూర్తయ్యాయి.

ఎమ్మెల్యే గారూ.. మీరిచ్చిన హామీలే ఇవి!

● సూళ్లూరుపేట సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులు పూర్తి చేసి తాగునీటిని అందించడం ● దొరవారిసత్రం మండలంలో 14 ఆర్ తెలుగు గంగ కాలువ నిర్మాణం పూర్తి చేయించడం ● నాయుడుపేట మండలం జువ్వలపాలెం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులు పూర్తి చేయించడం ● నాయుడుపేట వద్ద స్వర్ణముఖి నదిలో చెక్ డ్యాములు నిర్మించడం ● సూళ్లూరుపేట వద్ద కాళంగి నదిపైన, నాయుడుపేటలో స్వర్ణముఖి నదిపైన వంతెనల నిర్మాణం.



అసంపూర్తిగా వున్న సూళ్ళూరుపేట సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం

4.47 కేజీల వెండి విరాళం



శ్రీకాళహస్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి గుంతకల్లుకు చెందిన రాజు అనే వ్యాపారి 4.47 కేజీల వెండిని విరాళంగా సమర్పించారు. శనివారం దాత కుటుంబ సమేతంగా ముక్కంటి ఆలయానికి విచ్చేశారు. ఆలయ పరిపాలనా భవనంలో ఈవో బాపిరెడ్డిని కలిసి వెండి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతను ఘనంగా సత్కరించి, ప్రత్యేక దర్శనం కల్పించిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో - చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

శ్రీకాళహస్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆటోను గుర్తుతెలియని కారు ఢీకొట్టి వెళ్లడంతో 8 మంది గాయపడిన ఘటన శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి పంచాయతీ కోళ్లఫారం సమీపంలో శనివారం సాయంత్రం పీఎస్ జాతీయరహదారిపై జరిగింది. బాధితుల కథనం మేరకు... శ్రీకాళహస్తి మండలం ఎగువవీధి గ్రామానికి చెందిన మౌనిష్ అనే యువకుడు ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవిస్తున్నాడు. 8 మంది కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఉదయం గూడూరు సమీపంలోని బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి ఆటోలో వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి ఆటోలో బయలుదేరారు. కోళ్ల ఫారం దగ్గర జాతీయ రహదారిపై గుర్తు తెలియని కారు ఆటోను ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఆటో రోడ్డు పక్కకు బోల్తా కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న మౌనిష్‌తోపాటు జాహ్నవి, సుబ్బయ్య, అంకమ్మ, విశాలాక్షి, అన్విత్(5) షర్మిల(4) గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు ఘటనపై బాధ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు.

లారీని ఢీకొన్న కారు

● ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పెళ్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఆరుగురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ నాగరాజు తెలిన వివరాల మేరకు... శ్రీకాకుళం జిల్లాకు చెందిన మెహంతి సరస్వతి కుటుంబం హైదరాబాదులో నివాసం ఉంటోంది. శనివారం కుటుంబ సభ్యులందరూ కారులో హైదరాబాదు నుంచి తిరుమలకు బయలుదేరారు. పెళ్లకూరు మండలంలోని ఎగువచావాలి వద్దకు రాగానే వెనుక వస్తున్న లారీ ఓవర్‌టెక్ చేసి ముందు వెళ్తూ షడన్ బ్రేక్ వేసింది. దీంతో కారు లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో మెహంతి సరస్వతి(50), ఆమె భర్త గోవిందరాజు, కుమార్తె సాయినవ్య, లహరి, చెల్లెలు మీన తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా మెహంతి సరస్వతి మృతి చెందారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం పూర్తి చేశాక బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీసిటీలో అలరించిన అన్నమాచార్య సంకీర్తనలు



సంకీర్తనలు ఆలపిస్తున్న మల్లాది అనూష

సత్యవేడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన అన్నమయ్య పంచామృత వర్షిణి కార్యక్రమం సంగీత ప్రియులను అలరించింది. హైదరాబాదుకు చెందిన ప్రఖ్యాత అన్నమాచార్య కీర్తనల పండితుడు గంధం బసవ శంకరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన కుమారి మల్లాది అనూష వాయిద్య కళాకారులతో కలిసి 'బ్రహ్మమొక్కటే, అదిగో అల్లదిగో, చక్కని తల్లికి, చిన్ని శిశువు' తదితర అన్నమయ్య సంకీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. కాగా కీర్తనల ముందు శంకరరావు ఆ కీర్తనలకు సంబంధించిన సారాంశాన్ని, గొప్పదనాన్ని వివరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తిరుపతి శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్, ఎస్కే యూనివర్సిటీ మాజీ వీసీ కుసుమకుమారి కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి పల్లేటి బాలాజీ సమన్వయకర్తగా వ్యవహరించారు. శ్రీసిటీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, సూళ్లూరుపేట, శ్రీహరికోట ప్రాంతాలకు చెందిన పలువురు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీపీటీవో



తిరుపతి(ఆర్టీసీ)/కలెక్టరేట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): డీపీటీవోగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన జగదీష్ శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. కలెక్టర్ ఆయన్ను అభినందించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని, ప్రధానంగా రాబోవు శ్రీవారి బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకొని ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.

హైదరాబాదులో పట్టుబడ్డ ఏనుగు దంతాలు

భాకరాపేటలో చోరీకి గురైనవేనా..?

● అటవీ శాఖలో కలకలం ● చోరీకి గురైన గన్ ఎక్కడ?

తిరుపతి (మంగళం) జూన్ 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పోలీసులకు చిక్కిన ఏనుగు దంతాలు భాకరాపేట అటవీశాఖ రేంజ్ ఆఫీసులో చోరీకి గురైనవేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏనుగు దంతాలను తరలిస్తూ పట్టుబడ్డ డ్రైవర్ ప్రసాద్ అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందినవాడు. ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ ఫిబ్రవరిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కి జైలుకు కూడా వెళ్లాడు. కొన్ని రోజుల క్రితం హైదరాబాద్ బస్సులో ప్రయాణిస్తున్న అతని వద్ద ఏనుగు దంతాలు లభించడం సంచలనమే సృష్టించింది. తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల్లోని అడవుల్లో గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ హయాంలో ఏనుగులను చంపి వాటి దంతాలను స్మగ్లింగ్ చేశారు. ఆ తర్వాత తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ ఏనుగులను వేటాడి చంపిన దాఖలాలు లేవు. తాజాగా ప్రసాద్ చేత పట్టుబడ్డ ఏనుగు దంతాలు ఎక్కడివి అనే ప్రశ్న అందరికీ కలవరపాటుకు గురిచేస్తోంది. అటవీ శాఖ అధికారులు దీనిపై అంతర్గతంగా విచారణ చేపట్టినట్లు సమాచారం.

విచారణాధికారిని నియమించాం : సీసీఎఫ్ సెల్వం

ఈ వ్యవహారంలో విచారణ అధికారిగా అన్నమయ్య జిల్లా డీఎఫ్ఓ జగన్నాథ్ సింగ్‌ను నియమించాం.హైదరాబాద్ పోలీసులతో కేసుకు సంబంధించిన ఫైల్ తెప్పించి పట్టుబడ్డ ఏనుగు దంతాలు ఎక్కడ నుంచి స్మగ్లింగ్ జరిగాయి అన్న దానిపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తాం.

భాకరాపేట అటవీ శాఖ కార్యాలయంలో చోరీ..

2013లో తలకోన అటవీ ప్రాంతాల్లో రెండు ఏనుగులు ప్రమాదవశాత్తు మృతి చెందాయి. ఇందులో ఒక ఏనుగుకు సంబంధించిన దంతాలు పోస్టుమార్టం అనంతరం తొలగించి భాకరాపేట రేంజ్ ఆఫీసులో భద్రపరిచారు. అయితే 2023లో భాకరాపేట రేంజ్ ఆఫీసులో ఉన్న ఏనుగు దంతాలతో పాటుగా ఒక గన్ కూడా చోరీకి గురైంది. దీనిని గుర్తించిన అటవీశాఖ అధికారులు భాకరాపేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ కేసులో నిందితులు ఎవరో గుర్తించలేకపోయారు. అయితే ఈ చోరీ జరిగిన విషయం రహస్యంగా ఉంచారు. అటవీ శాఖ ఉన్నతాధికారులకు సైతం ఈ విషయం తెలుసా అన్నది అనుమానంగానే ఉంది. భాకరాపేట పోలీస్‌స్టేషన్లో 87-23 నంబర్‌తో కేసు కూడా నమోదైంది.

అటవీశాఖ అధికారులు గుబులు

దాదాపు ఒకటిన్నర సంవత్సరం తర్వాత భాకరాపేట రేంజ్ ఆఫీసులో అదృశ్యమైన దంతాలు హైదరాబాదులో పట్టుబడ్డ దంతాలు ఒకటేనేమో అన్న అనుమానంతో అటవీశాఖ అధికారుల్లో గుబు లు మొదలైంది. ఏనుగు దంతాలు, గన్ కావడంతో బయటకు చెప్పుకుంటే పరువు పోతుందని అటవీ శాఖ అధికారులు భయపడ్డా నేడు బయట పెట్టడం అనివార్యంగా కనిపిస్తోంది. హైదరాబాద్‌లో దొరికిన ఏనుగు దంతాలతో పాటు గన్ కూడా ప్రసాద్ వద్ద ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నాందేడ్-తిరుపతి మధ్య 16 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్) జూన్28(ఆంధ్రజ్యోతి) తిరుపతిలో నెలకొన్న ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి నాందేడ్ -తిరుపతిల మధ్య 16 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. కాగా 8 సర్వీసులు ఒక మార్గంలో, 8 సర్వీసులు మరో మార్గంలో నడపనున్నామని వెల్లడించారు. ఈ ప్రత్యేక రైళ్లు జూలై 4నుంచి 27వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయన్నారు. ● ఈ ప్రత్యేక రైలు(07189)నాందేడ్‌లో జూలై 4వ తేదీ శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి ముడికేడ్, దర్మాబాద్, బాసర, నిజమాబాద్, కామారెడ్డి, మేడ్‌చర్ల, చర్లపల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడుకుడి, పిడుగురాళ్ల, నెమలిపురి, రొంపిచర్ల, వినుకొండ, దొనకొండ, మార్కాపురంరోడ్డు, కుంబ్బం, గిద్దలూరు, దేవరమిట్ట, నంద్యాల, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, కడప, నందలూరు, రాజంపేట, కోడూరు, రేణిగుంట స్టేషన్ల మీదుగా మరుసటి రోజు మధ్యాహ్నం 12.30గంటలకు తిరుపతికి చేరుకొంటుంది. ● తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07190) శనివారం మధ్యాహ్నం 2.20 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ ఆదివారం ఉదయం 9.30 గంటలకు నాందేడ్ చేరుకొంటుంది. ● ఈ ప్రత్యేక రైలు(07015)నాందేడ్‌లో జూలై 5వ తేదీ శనివారం సాయంత్రం 4.50 గంటలకు బయలుదేరి ముడికేడ్, దర్మాబాద్, బాసర, నిజమాబాద్, కామారెడ్డి, మేడ్‌చర్ల, మల్కాజ్‌గిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్‌చర్ల, మహబుబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూల్ సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, కోడూరు, రేణిగుంట స్టేషన్ల మీదుగా మరుసటి రోజు ఉదయం 10.10గంటలకు తిరుపతికి చేరుకొంటుంది.

● తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07016) ఆదివారం సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ సోమవారం మధ్యాహ్నం 1.15 గంటలకు నాందేడ్ చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైళ్లలో 1, 2, 3, ఏసీలతోపాటు సెకండ్ క్లాస్ స్లీపర్ కోచ్‌లు, సాధారణ కోచ్‌లు కూడా ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సమయాన్ని మరిచిన గడియారం

మూడు వైపులా ఒకలా... ఒకవైపు మరోలా..



ఓ వైపు సరైన సమయం చూపుతూ, మరో వైపు పనిచేయని టవర్‌క్లాక్‌లోని గడియారం

గూడూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ గూడూరు పట్టణానికి ఐకాన్‌గా నిలుస్తోంది. పట్టణ నడిబొడ్డున నాలుగు దిక్కులూ కలిసే కూడలిలో 1975లో దాతల సహకారంతో టవర్‌క్లాక్ ఏర్పాటు చేశారు. అప్పట్లో గూడూరులో మైకా పరిశ్రమలు ఉండేవి. వీటిల్లో పనిచేసేందుకు గూడూరు సమీప గ్రామాల నుంచి ప్రజలు వస్తుండే వారు. అంతేకాకుండా గూడూరు డివిజన్ కేంద్రం కావడంతో వివిధ పనుల మీద పలు గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. ఎటు వైపు నుంచైనా ప్రజలు సమయాన్ని తెలుసుకునేందుకు వీలుగా టవర్‌కు నాలుగు దిక్కుల్లో గడియారాలను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఈ ప్రాంతం టవర్‌క్లాక్ కేంద్రంగా పిలవబడుతూ గూడూరుకు ఐకాన్‌గా నిలిచిపోయింది. కాలక్రమేణా టవర్‌క్లాక్ శిథిలావస్థకు చేరుకోవడంతో 2021లో తొలగించారు. 2024లో దాతల సహకారంతో అధునాతన డిజైన్‌తో నూతన టవర్‌క్లాక్‌ను నిర్మించారు. రైల్వేస్టేషన్, ఆస్పత్రి రోడ్డు, రైతు బజారు సెంటర్, పాత బస్టాండుతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే నాలుగు దిక్కుల్లో టవర్‌కు గడియారాలను ఏర్పాటు చేశారు. అయితే కొంతకాలంగా రైతు బజారు సెంటర్ దిక్కులోని గడియారం పనిచేయడంలేదు. సంబంధిత అధికారులు స్పందించి టవర్‌క్లాక్‌లో అన్ని గడియారాలు పనిచేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నత్తనడకన పోలేరమ్మ ఆర్చి నిర్మాణం

రాకపోకలకు ఇబ్బంది పడుతున్న పట్టణవాసులు

తరచూ ట్రాఫిక్ సమస్యతో వాహనదారుల అవస్థలు



పోలేరమ్మ ఆర్చి నిర్మాణం

వెంకటగిరి టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రాస్ రోడ్డులో నిర్మిస్తున్న వెంకటగిరి గ్రామదేవత పోలేరమ్మ ఆర్చి నిర్మాణం నత్తనడన సాగుతోంది. గత ఏడాది డిసెంబరు 14న ఆర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శంకుస్థాపన చేశారు. పనులు జరుగుతున్నందున ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వీలుగా ఓ పక్కన దారి వదిలారు. అది ఇరుకుగా ఉండడంతో వాహనాలు ప్రయాణించడానికి ఇబ్బందులు పడాల్సివస్తోంది. తిరుపతి, నాయుడుపేట, శ్రీకాళహస్తి వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు క్రాస్ రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్టాండుకు వెళ్లాలి. క్రాస్ రోడ్డులో ఆర్చి నిర్మాణ పనులు జరుగుతుండడంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. క్రాస్ రోడ్డు నుంచి కాకుండా పాలకేంద్రం వైపుగా బస్టాండుకు వెళ్లాలంటే అర్ధగంట పడుతుంది. ఇక క్రాస్ రోడ్డు - బస్టాండు మధ్య ఉండే రాణీపేట, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగించడానికి నానాపాట్లు పడుతున్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని ఆర్చి నిర్మాణం త్వరగా పూర్తి చేయించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

గూడూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని కళాశాల నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిసైతే భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. మత్తు పదార్థాలను వినియోగించినా, విక్రయించినా చట్టరీత్యా నేరమన్నారు. చెడు అలవాట్లకు బానిసలు కాకుండా మంచి అలవాట్లను అలవర్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, డాక్టర్ పీర్ కుమార్, కోటేశ్వరరావు, సురేంద్ర, కిరణ్మయి, శ్రీధర్‌శర్మ, రవిరాజు, శైలజ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు కమిటీ నియామకం

సూళ్లూరుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యనమల సుదర్శనం తెలిపారు. శనివారం షార్ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ లైబ్రరీలో నూతన కమిటీల ఎన్నిక జరిగింది. తిరుపతి జిల్లా అధ్యక్షుడుగా మీజూరు మాధవ్, నెల్లూరు జిల్లా అధ్యక్షుడుగా బల్లి వెంకటయ్యను ఎన్నుకున్నారు. అలాగే తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా బూదూరు మహేశ్వరి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆవుల సతీష్(దాస్), నియోజకవర్గ అధ్యక్షుడుగా జాన్ పీటర్, కన్వీనర్‌గా వీవీ రమణ, కార్యదర్శిగా ఇంగిలాల కిరణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీని సన్మానించారు.


మెమూ రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించాలి

నాయుడుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు వచ్చే మెమూ రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించేలా చూడాలని ఎంపీ గురుమూర్తికి రైల్వే ప్యాసింజర్స్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం వారు తిరుపతిలో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. మెమూ రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించడంతో పాటు కరోనా ముందు స్టాపింగ్ ఉన్న చెన్నై ఎక్స్‌ప్రె‌స్‌తో పాటు పలు రైళ్లను నాయుడుపేట స్టేషన్‌లో ఆపేలా చూడాలని కోరారు. ఎంపీ స్పందిస్తూ రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సదరన్ రైల్వే ప్యాసింజర్స్ అసోసియేషన్స్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, మస్తానయ్య, ఎం.మస్తాన్, ఆర్.రాఘవన్, కిరణ్‌కుమార్, కిషోర్, డీఆర్‌యూసీసీ మెంబరు పేర్నాటి జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ ఖాతా నంబర్లను సబ్‌డివిజన్ చేయండి

బాలాయపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీసర్వే పూర్తయిన కోనంగుంట, కరిమెనగుంట, పిగిలాం, సుబ్రహ్మణ్యం, వెంకటరెడ్డిపల్లి బాలాయపల్లి, సంగవరం, యాచవరం, రామాపురం గ్రామాల్లో జాయింట్ ఖాతా నంబర్లను సబ్‌డివిజన్ చేయాలని డివిజనల్ సర్వేయర్ సుబ్బరాయుడు అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ ఖాతా నంబర్ల వల్ల రైతులు ప్రభుత్వ పథకాలకు అర్హత కోల్పోతున్నారని చెప్పారు. ఒక్కో రైతుకు ఒక్కో నంబరు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఆర్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జికి సన్మానం



జస్టిస్ శ్రీనివాసులురెడ్డిని సన్మానిస్తున్న గంగరాజు

నాయుడుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసులురెడ్డిని ఉమ్మడి నెల్లూరు జిల్లా బార్ అసోసియేషన్ ఈసీ మెంబరు పనబాక గంగరాజు సన్మానించారు. శనివారం నెల్లూరు జిల్లా కోర్టుకు వచ్చిన జస్టిస్ శ్రీనివాసులురెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

గ్యాస్ గోదాము కూల్చివేత కేసులో ఒకరి అరెస్టు

తడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ గోదాము కూల్చివేత కేసులో ఒక నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. తడలోని సుభాషిణి గ్యాస్ ఏజెన్సీ గోదామును గురువారం అర్ధరాత్రి కొందరు కూల్చివేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలోని విచారణ జరిపారు. పులి వెంకటరమణయ్యను మొదటి నిందితుడిగా నిర్ధారించి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు: ఇద్దరికి గాయాలు

పెళ్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళాయిపాడు వద్ద జాతీయ రహదారి నుంచి సర్వీస్ రోడ్డులోకి వెళ్తున్న ఆర్టీసీ బస్సును కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో దువ్వూరు శ్రావణ్ కుమార్ రెడ్డి, రవీంద్రారెడ్డికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేగ నియంత్రణకు చర్యలేవీ?

ప్రధాన రహదారులపై స్పీడు బ్రేకర్లు లేక తరచూ ప్రమాదాలు



స్పీడ్ బ్రేకర్లు లేని సంగం థియేటర్ వద్ద కూడలి

గూడూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన రహదారి వెంబడి కూడళ్ల వద్ద, మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనాల వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక సాయిబాబాగుడి సమీపంలో గూడూరు పట్టణంలోకి వచ్చే ప్రధాన రహదారిపై గతంలో ఉన్న స్పీడ్ బ్రేకరును తొలగించారు. ఈ ప్రాంతంలో పాఠశాలలు, బ్యాంకులు, వివిధ కార్యాలయాలకు ప్రజలు వెళ్లి వస్తుంటారు. స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో వేగంగా వచ్చే వాహనాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయంలో ఓ మోటారు సైకిల్‌ను ఆటో ఢీకొంది. అదేవిధంగా స్థానిక సంగం థియేటర్ కూడలి వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్గం ద్వారా పట్టణంలోకి వచ్చే వాహనాలు, ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్‌కు వెళ్లే వారు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం రద్దీగా కూడలి వద్ద స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక మోతీమహల్ సెంటర్, ఏరియా ఆస్పత్రి ఎదురుగా, పాత బస్టాండుకు వెళ్లే మార్గంలో, రైల్వేస్టేషన్ సమీపంలోని మలుపు వద్ద, శాంతినగర్ అండర్‌బ్రిడ్జి సమీపంలోని మలుపు వద్ద నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఈ ప్రాంతాల్లో ఏదో ఒకచోట తరచూ వాహనాలు ప్రమాదాలకు లోనవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రధాన రహదార్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకుడు శివప్రసాద్, పక్కన ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): టీడీపీలో చురుగ్గా పనిచేసే సమర్థవంతులైన నాయకులను గ్రామ కమిటీలకు ఎన్ను కోవాలని నియోజకవర్గ పరిశీలికుడు డాక్టర్ శివప్రసాద్ అన్నారు. శనివారం సూళ్లూరుపేట పట్టణంలోని సత్యసాయి కల్యాణ మండపంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అధ్యక్షతన సంస్థాగత ఎన్నికల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ అందరూ సమన్వయంతో సమర్థవంతమైన నాయకులను ఎన్నుకుంటే గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం అవుతుందన్నారు. వివాదాలకు తావులేకుండా సమన్వయంతో సంస్థాగత ఎన్నికలు నిర్వహించి అందరి అభిప్రాయాలతో గ్రామ, పట్టణ కమిటీలను నియమిస్తామని చెప్పారు. నెల్లూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం లభిస్తుందని, ఇందులో ఎటువంటి సందేహం వద్దన్నారు. 2029లో మళ్లీ మనం అధికారంలోకి రావాలంటే వివాదాలకు తావులేకుండా నాయకులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. రాబోయే మున్సిపల్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగురవేయాలన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, నాయుడుపేట మండలాల పరిశీలకులు షేక్ రఫీ, నువ్వుల శివరామ కృష్ణ, పచ్చిగార్ల రత్నం, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, నాయకులు కామిరెడ్డి మురళీరెడ్డి, శ్రీనివాసులు నాయుడు, కందల కృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, కొక్కు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తగుంట ఎస్సీ కాలనీలో తాగునీటి కష్టాలు



ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి నీటిని తెచ్చుకుంటున్న ఎస్సీ కాలనీవాసులు

చిట్టమూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిట్టమూరులోని కొత్తగుంట ఎస్సీ కాలనీవాసులు తాగునీటికి కష్టాలు పడుతున్నారు. వాకాడు స్వర్ణముఖి నది నుంచి వచ్చే కోగిలి సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ ద్వారా కొత్తగుంట ఎస్సీ కాలనీకి తాగునీటి సరఫరా జరుగుతోంది. కొందరు అక్రమంగా కుళాయిలు, వరలతో నేలబావులు ఏర్పాటు చేసుకోవడం, మోటార్ల ద్వారా నీటి తోడేస్తుండడంతో అందరికీ తాగునీరు అందడంలేదు. అలాగే కొన్నిచోట్ల పైపు లైన్ దెబ్బతినడం వల్ల తాగునీరు వృధాగా పోతోంది. అంతేకాకుండా కొందరు భవన నిర్మాణాలకు సైతం తాగునీటినే వాడుతున్నారు. దీంతో అందరికీ సరిపడా నీరు అందక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ సమీపంలోని ఓవర్ హెడ్ ట్యాంక్ ఓవర్ ఫ్లో అయి బయటకు వచ్చే నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి ఎస్సీ కాలనీలో తాగునీటి కొరత లేకుండా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యభిచార గృహ నిర్వాహకురాలిపై కేసు

నాయుడుపేట టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజగోపాలపురం ప్రాంతంలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ఇంటిని తనిఖీ చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. వ్యభిచార గృహ నిర్వాహకురాలితో పాటు ఓ విటుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇరకంకుప్పంవాసులకు పూడికుప్పంలో ఇళ్ల స్థలాలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి

తడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇరకంకుప్పం గ్రామస్తులు పూడికుప్పంలో నివాసం ఏర్పరుచుకునేందుకు వీలుగా త్వరలోనే ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తామని ఆర్డీవో కిరణ్మయి తెలిపారు. శనివారం ఇరకంకుప్పం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. పూడికుప్పం గ్రామంలో నివాసం ఉండేందుకు ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలంటూ గ్రామస్తులంతా దరఖాస్తు చేసుకోవడంతో గ్రామసభ నిర్వహిస్తున్నామని ఆర్డీవో చెప్పారు. పూడికుప్పంలో ప్రస్తుతానికి 160 మందికి ఇళ్లస్థలాలు కేటాయించేందుకు నిర్ణయించామన్నారు. దీనిపై గ్రామస్తుల అభిప్రాయాలను తెలపాలని కోరగా అందరూ సమ్మతించారు. అనంతరం మత్స్యకార మహిళలతో కొంతసేపు ఆర్డీవో ముచ్చటించారు. గ్రామసభలో తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో శేఖర్ నాయక్, ఆర్డీవో కార్యాలయ ఏవో రవికుమార్, వీఆర్వో బాబు, పంచాయతీ కార్యదర్శి మస్తాన్, గ్రామపెద్దలు వాసు, గుణ, వినోద్, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అంతదూరం పంపలేం

పాఠశాలల విలీనాన్ని అంగీకరించని తల్లిదండ్రులు



వాక్యంలో విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడుతున్న అధికారులు

బాలాయపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలిమిలి పాఠశాల విద్యార్థులను మన్నూరుకు, నిండలి పంచాయతీలోని వాక్యం ప్రాథమిక పాఠశాల విద్యార్థులను కడగుంటకు తరలించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విద్యార్థుల తల్లితండ్రులు ముక్త కంఠంతో వ్యతిరేకించారు. తమ గ్రామాల్లోని పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ విద్యార్థుల తల్లితండ్రులు ఇటీవల కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో వినీల్ కుమార్, ఎంఈవో ప్రదీప్ కుమార్ శనివారం ఆయా గ్రామాల్లోని విద్యార్థుల తల్లితండ్రులను కలిసి మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన పాఠశాలకు విద్యార్థుల పంపేలా ఒప్పించేందుకు ప్రయత్నించారు. విద్యార్థుల తల్లితండ్రులు మాట్లాడుతూ అలిమిలి నుంచి మన్నూరుకు నాలుగు కిలోమీటర్లు, వాక్యం నుంచి కడగుంటకు ఆరు కిలోమీటర్లు వెళ్లాలని, విద్యార్థులు అంతదూరం వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. తమ పిల్లలు తమ గ్రామాల్లోని పాఠశాలల్లోనే చదువుకునేలా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

యువతి ఆత్మహత్య



మృతిచెందిన మహేశ్వరి

చిల్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైటాసత్రం గిరిజన కాలనీలో ఓ యువతి శనివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని రైటాసత్రం గిరిజన కాలనీకి చెందిన మహేశ్వరి(18) గూడూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివి ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటోంది. యువతి తల్లి మృతి చెందింది. తండ్రి శివప్రసాద్ కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తుంటాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహేశ్వరి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



సాయినరేంద్ర (ఫైల్‌ఫొటో)

చిల్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివేడు సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని కమ్మవారిపాళెం గ్రామానికి చెందిన సాయినరేంద్ర(31) గూడూరులోని ఎస్‌బీఐలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో గ్రామానికి వెళుతుండగా కడివేడు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

గూడూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లటూరు గ్రామంలో శనివారం గంగజాతర వైభవంగా నిర్వహించారు. భక్తులు గంగపెట్టెను, బోనాలను తలపై ఉంచుకుని మంగళవాయిద్యాలు, తప్పెట్లు, గొల్లల వీరతాళ్ల నడుమ గ్రామోత్సవం జరిపారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.



బోనాలు, గంగపెట్టేను ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా అగ్నిగుండ మహోత్సవం

పెళ్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబేడు గ్రామంలో శనివారం రాత్రి అగ్నిగుండ మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పాండురంగ స్వామి ఆలయాన్ని పలు రకాల పూలు, విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా అలంకరించారు. ముందుగా స్వామివారికి కలశపూజ ప్రారంభించి పండరీ భజనలు, కోలాటాలు వేశారు. భజన గురవయ్యదాస్ ఆధ్వర్యంలో స్వామివారి కంకణాలు ధరించి దీక్షలో ఉన్న భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు.

విద్యాసామగ్రి పంపిణీ

గూడూరు అర్బన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీభవన్‌లో విద్యార్థులకు విద్యాసామగ్రిని శనివారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, జీజీ నాయుడు, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, డాక్టర్ రమణయ్య, రాజేంద్రకుమార్, మునిగిరీష్, డాక్టర్ జనార్దనరెడ్డి, దశరధరామిరెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి నిధులివ్వండి

పెళ్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీలపాటూరు ఎస్సీకాలనీ శ్మశానవాటికలో ఆక్రమణలను తొలగించి అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో జీలపాటూరు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పార్థసారధి, గ్రామస్తులు ఎస్వీ రాజ, బుడతోటి మురళి, చింతల ఎల్లయ్య, కత్తి గురవయ్య, చింతల రామకృష్ణ, పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ

దొరవారిసత్రం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళెం, బుదూరు గ్రామాల్లో నట్టల నివారణ మందులను పశువైద్యాధికారి శ్రీదేవి పంపిణీ చేపట్టారు. గొర్రెల్లో వచ్చే నట్టల నివారణకు ముందస్తుగా రాష్ట్ర ప్రభుత్వం మందులను తాపించే కార్యక్రమం చేపట్టిందని, వచ్చే నెల 9 వరకు అన్ని గ్రామాల్లో కార్యక్రమం జరుగుతుందని వైద్యాధికారి తెలిపారు.